# యువ వెలుగు

యువ వెలుగు - ప్రజల వెలుగు

PRGI NO:- TGTEL/26/A6429 | తెలుగు దిన పత్రిక

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ ఎడిటర్ : పి.మహేష్ గౌడ్ సంపుటి : 1 సంచిక : 01 ఆదివారం, ఆగస్టు 16, 2026 , పేజీలు - 08 వెల: 3/-



**రిపోర్టర్లు కావలెను...**

తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా వెలువడుతున్న యువ వెలుగు దినపత్రికలో బ్యూరో, జిల్లాల , మండలల రిపోర్టర్‌గా పని చేయుటకు నియోజకవర్గ స్థాయుల్లో ఉత్సాహవంతులైన యువతి,యువకులు కావలెను, కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును.

9908 502 602


## నీటి హక్కుల విషయంలో రాజీపడేదే లేదు

● పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేస్తాం..రైతుల కండ్లల్లో ఆనందం చూస్తాం ● విద్యాసూచీలో రాష్ట్రాన్ని 18వ స్థానానికి చేర్చాం ● మట్టిలో మాణిక్యాలను వెలికి తీసేందుకే సీఎం కప్ ● టీజీఐపాస్ ద్వారా 1.29 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించాం ● 2034 నాటికి కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే మా లక్ష్యం : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ● గోల్కొండ కోటలో జాతీయ జెండావిష్కరణ



హైదరాబాద్,ఆగస్టు 15 యువ వెలుగు : కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణకు దక్కాల్సిన నీటి హక్కుల విషయంలో రాజీపడేదే లేదని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రానికి రావాల్సిన ప్రతీ నీటి బొట్టునూ సాధించి తీరుతామన్నారు. తుమ్మడిహెట్టి నుంచి పాలమూరు వరకు పెండింగ్ లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను ప్రాధాన్యక్రమంలో పూర్తి చేసి చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందిస్తామని ఆయన హామీనిచ్చారు. వ్యవసాయాన్ని పండుగగా మార్చి రైతుల కండ్లల్లో ఆనందం చూస్తామని వ్యాఖ్యానించారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శనివారం సీఎం రేవంత్ రెడ్డి హైదరాబాద్ లోని గోల్కొండ కోటలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. అంతకుముందు వేడుకలకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన సీఎంకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, డీజీపీ సీవీ ఆనంద్ స్వాగతం పలికారు. అనంతరం పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించిన ముఖ్యమంత్రి... రాష్ట్ర ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. తమ 32 నెలల పరిపాలనలోసాధించిన విజయాలు, అమలు చేసిన పథకాలు,

మిగతా2లో...

## దేశ భవిష్యత్ ప్రగతికి సరికొత్త దిశానిర్దేశం

● ఆయా రంగాల్లో స్వయంసమృద్ధితో వికసిత భారత్ సాధ్యం ● ఆర్థిక,సామాజిక ఎదుగుదలకు చోదకశక్తి కావడం తథ్యం ● సప్తధార సందేశం ఇచ్చిన ప్రధాని నరేద్ర మోడీ



న్యూఢిల్లీ,ఆగస్టు 15 యువ వెలుగు : భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోట వేదికగా ప్రధాని నరేంద్ర మోడీ చేసిన ప్రసంగం దేశ భవిష్యత్తు ప్రగతికి సరికొత్త దిశానిర్దేశం చేసింది. 2047 నాటికి 'వికసిత్ భారత్', స్వయం సమృద్ధి సాధించడమే లక్ష్యంగా, దేశాన్ని నడిపించే ఏడు ప్రాథమిక శక్తులను 'సప్తధార' పేరుతో ఆయన ఆవిష్కరించారు. ఈ ఏడు రంగాలు భారతదేశ రాబోయే ఆర్థిక, సామాజిక ఎదుగుదలకు చోదక శక్తులుగా నిలుస్తాయని పేర్కొన్నారు. మొదటి ధార మాన్యు ఫ్యాక్చరింగ్. దేశ తదుపరి వృద్ధి దశకు మాన్యుఫ్యాక్చరింగ్ బలమైన పునాదిగా మోడీ అభివర్ణించారు.

మిగతా2లో...

## భారత్ ప్రత్యేక గౌరవాన్ని సంపాదించుకుంది

- అంతర్జాతీయ వేదికలపై ఇరు దేశాలూ కలిసి పని చేస్తున్నాయి
- అంతర్జాతీయ ద్వైపాక్షిక సంబంధాల బలోపేతం కోసం కృషి
- అంతర్జాతీయ స్వాతంత్ర్య వేడుకల వేళ రష్యా అధ్యక్షుడి ప్రశంసలు
- అంతర్జాతీయ ద్రౌపదీ ముర్ము, మోడీలకు పుతిన్ శుభాకాంక్షలు



2లో

## సిద్దిపేటలో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసిన మంత్రి పొన్నం



సిద్దిపేట, యువ వెలుగు : సిద్దిపేట పట్టణంలోని వైశ్య కన్వెన్షన్ భవనంలో మంత్రి పొన్నం ప్రభాకర్ లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. సిద్దిపేట జిల్లాలోని ఆరు నియోజకవర్గాలకు చెందిన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంగారెడ్డి లో స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు లాంఛనంగా

మిగతా2లో...

## కేసీఆర్..సాగుపై చర్చకు సిద్ధమా?

● అసెంబ్లీలో చర్చిద్దాం రండీ..రేషన్ కార్డు పేదల ఆత్మగౌరవం

● జగ్గారెడ్డి లాంటి నాయకుడు దొరకడు : ముఖ్యమంత్రి

● సంగారెడ్డిలో కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభం



మెదక్,యువ వెలుగు :"తమ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను బీఆర్ఎస్, బీజేపీ ప్రశ్నిస్తున్నాయి. ఆ రెండు పార్టీలు ఒకే నాణేనికి బొమ్మ బొరుసులాంటివి. గత ప్రభుత్వంలో వరి వేస్తే ఉరి అన్న కేసీఆర్.. తన ఫామ్‌హౌస్‌లో మాత్రం వరి సాగు చేశాడు. తాము రైతులకు మేలు చేస్తుంటే ఫామ్‌హౌస్‌లో పడుకుని మాపై విమర్శలు చేస్తున్నాడు. సంగారెడ్డి గడ్డ నుంచి సవాల్ చేస్తున్నా.. రైతులకు తాము చేసిన మేలేంటో... మీరు చేసిన అన్యాయం ఏంటో చర్చించేందుకు అసెంబ్లీకి రండీ" అని ముఖ్యమంత్రి

మిగతా2లో...

## కళ్యాణలక్ష్మి రద్దుకు కాంగ్రెస్ కుట్ర

- ప్రభుత్వ అవినీతిని బట్టబయలు చేస్తున్న సొంత పార్టీ ఎమ్మెల్యేలు
- రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యలతో ఏకీభవిస్తున్నా:బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



హైదరాబాద్,యువ వెలుగు : రాష్ట్రంలో అవినీతి, అక్రమాలు ఏ స్థాయిలో ఉన్నాయో ప్రతిపక్షాలు మాత్రమే చెప్పడం లేదనీ, కాంగ్రెస్ పార్టీకి చెందిన సొంత పార్టీ ఎమ్మెల్యేలే బహిరంగంగా మాట్లాడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) అన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలతో తాను పూర్తిగా ఏకీభవిస్తున్నానని చెప్పారు. అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధే ప్రభుత్వ పెద్దలపై అవినీతిని బట్టబయలు చేసే పరిస్థితి వచ్చిందంటే

మిగతా2లో...




2లో

## నిరుద్యోగులకు తీపి కబురు

హైదరాబాద్,యువ వెలుగు :రాష్ట్రంలో నిరుద్యోగులకు శుభవార్త. వచ్చే వారం నుంచే వరుసగా కొత్త ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేసేందుకు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ సన్నాహాలు చేస్తోంది. కమిషన్ కార్యాలయంలో శనివారం 80వ స్వాతంత్ర్య

మిగతా2లో...

## చరిత్ర తెలుసుకుంటేనే ... భవిష్యత్ నిర్మాణం

- టిఆర్ఎస్ కార్యాలయంలో జెండా ఆవిష్కరణలో కవిత



హైదరాబాద్,యువ వెలుగు : చరిత్రను తెలుసుకున్న వాళ్లే భవిష్యత్తును చక్కగా నిర్మించగలరని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత అన్నారు. టీఆర్ఎస్ రాష్ట్ర కార్యాలయంలో 80వ స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహించారు.కవిత జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం మాట్లాడుతూ... బ్రిటీష్ పాలనలో జరిగిన

మిగతా2లో...

## ప్రజల అవసరాలు గుర్తించి సంక్షేమ పాలన

అన్ని వర్గాలకు న్యాయం చేయడం కోసం కృషి

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీలో డిప్యూటి సిఎం భట్టి



ఖమ్మం,యువ వెలుగు : తెలంగాణ ప్రజల అవసరాలే పరమావధిగా ప్రజా ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. కాంగ్రెస్ పాలనలో మహిళలు, విద్యార్థులు, రైతులు సహా అన్ని వర్గాలకూ సంక్షేమం అందుతోందని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా కలెక్టరేట్‌లో తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. డిప్యూటీ సీఎం భట్టి ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వం కొత్త రేషన్ కార్డుల జారీ విషయంలో కాలయాపన చేసిందని విమర్శించారు. ప్రజా పంపిణీ వ్యవస్థలో నకిలీలను

మిగతా2లో...

# నీటి హక్కుల విషయంలో రాజీపడేదే లేదు

(మొదటి పేజీ తరువాయి)

వాటి ఫలితాలను ఆయన సోదాహరణంగా ఏకరువు పెట్టారు. 2025-26లో రాష్ట్ర తలసరి ఆదాయం రూ.4,18,932 (దేశ తలసరి ఆదాయం కంటే 91 శాతం అధికం)గా ఉండటాన్ని రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బలమని ఆయన అభివర్ణించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు వ్యవసాయం, రైతు సంక్షేమానికి దాదాపు 1.70 లక్షల కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. వరి సాగు, విస్తీర్ణంలో దేశంలోనే రాష్ట్రం నెంబర్ వన్ గా నిలిచిందంటూ హర్షం వ్యక్తం చేశారు. గత యాసంగిలో 81.12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్టు చెప్పారు. **విద్యాసూచీలో 18వ స్థానం** విద్యారంగంలో తమ ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు స్పష్టమైన ఫలితాలనిచ్చాయని సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పర్ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్ లో తెలంగాణ 28వ స్థానం నుంచి 18వ స్థానానికి చేరిందని గుర్తుచేశారు. రాష్ట్రంలో వందకుపైగా తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల నిర్మాణమే లక్ష్యమని చెప్పారు. వీటిలో ఇప్పటికే 105 స్కూళ్లను మంజూరు చేశామనీ, 84 బడులకు అనుమతులిచ్చామని వివరించారు. ప్రతీ నియోజకవర్గంలో ఒక యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ను నిర్మిస్తున్నట్టు తెలిపారు. ప్రీ ప్రైమరీ తరగతులను ప్రారంభించామనీ, డైట్ చార్జీలను 40 శాతం, కాస్మోటిక్ చార్జీలను 212 శాతం పెంచామని గుర్తు చేశారు. దాదాపు 22 లక్షల మంది పిల్లలకు అల్పాహారం, పాలు, పోషకాహారం అందిస్తున్నట్టు తెలిపారు. జూనియర్ కాలేజీల్లో సైతం మధ్యాహ్న భోజనం అమలు చేస్తున్నట్టు వివరించారు. 11 లక్షల మంది విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్‌ను వారి ఖాతాల్లోనే నేరుగా జమ చేసే విధానాన్ని అమల్లోకి తెచ్చామని చెప్పారు. **ఆ మాణిక్యాల కోసం సీఎం కప్** గ్రామీణ క్రీడాకారుల్లోని ప్రతిభను ప్రపంచస్థాయికి తీసుకెళ్లే క్రీడా విధానాన్ని అమలు చేస్తున్నామని సీఎం ఈ సందర్భంగా తెలిపారు. యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీతోపాటు గచ్చిబౌలిలో స్పోర్ట్స్ డిస్ట్రిక్ట్ ను ఏర్పాటు చేశామని అన్నారు. మట్టిలోని మాణిక్యాలను వెలికి తీసేందుకే సీఎం కప్ ను నిర్వహించినట్టు వివరించారు. త్వరలో తెలంగాణ వేదికగా 'ఖేలో ఇండియా యూత్ గేమ్స్ -2026'ను నిర్వహించబోతున్నట్టు సీఎం ప్రకటించారు. యువతకు విద్యతో పాటు నైపుణ్య కోర్సుల్లో శిక్షణను అందిస్తూ ఉద్యోగవకాశాలను పెంచామని అన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో ఇప్పటికే 72 వేల ఉద్యోగాలను భర్తీ చేశామనీ, టీజీపీఎస్సీ ద్వారా 456, పోలీస్ రిక్రూట్ మెంట్ బోర్డు ద్వారా 7,435 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు ఇచ్చామని తెలిపారు. నోటిఫికేషన్లు ఇచ్చే బాధ్యత తమదనీ, చదువుకుని ఉద్యోగాలు దక్కించుకోవాల్సిన బాధ్యత యువతదని సూచించారు. ఇతర వ్యాపకాల వైపు మళ్లకుండా పరీక్షలకు సిద్ధపడాలని విద్యార్థులను కోరారు. **వెల్లువలా పెట్టుబడులు... ?** టీజీఐపాస్ ద్వారా ఇప్పటికే రూ.1.29 లక్షల పెట్టుబడులు సాధించామనీ, వీటితో 78 వేలకు పైగా ఉద్యోగవకాశాలు రాబోతున్నాయని సీఎం తెలిపారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ - 2025లో రూ.5.75 లక్షల కోట్ల పెట్టుబడులకు ఎంవోయూలు కుదిరినట్టు చెప్పారు. 2025-26లో ఐటీ ఎగుమతులు రూ.3.97 లక్షల కోట్లకు చేరాయనీ, ప్రత్యక్ష ఐటీ ఉద్యోగాలు 12.14 లక్షలకు పెరిగాయని తెలిపారు. హైదరాబాద్ లో ఇప్పటికే 355కు పైగా గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లు ఉన్నాయనీ, 2026లో కొత్తగా 40 సెంటర్లు వచ్చాయని తెలిపారు. దీంతో రాష్ట్రం పెట్టుబడులకు చిరునామాగా మారుతున్నదని సీఎం హర్షం వ్యక్తం చేశారు. **2034 నాటికి కోటి మంది మహిళలు కోటీశ్వరులు** 2034 నాటికి కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంతో తమ ప్రభుత్వం పని చేస్తున్నదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఆ దిశగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహ జ్యోతి, రూ.500కే గ్యాస్ సిలిండర్, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ తదితర పథకాలు, ఆర్థిక సాయాల కోసం వేల కోట్ల రూపాయలను ఖర్చు చేసినట్టు తెలిపారు. స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ ద్వారా రూ.60,487 కోట్ల రుణాలను అందించామన్నారు. వడ్డీ లేని రుణాల కింద రూ.1,900 కోట్ల రాయితీని విడుదల చేసినట్టు తెలిపారు. మహిళలను పెట్రోల్ బంకులు, సోలార్ విద్యుత్ ప్లాంట్లు, ఆర్టీసీ బస్సులకు యజమానులుగా మార్చామన్నారు. **సామాజిక భద్రతకు పెద్దపీట** తమ ప్రభుత్వం సామాజిక భద్రతకు పెద్దపీట వేస్తోందని సీఎం తెలిపారు. రాష్ట్రంలో 3.38 కోట్ల మందికి సన్న బియ్యం అందిస్తున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. తొలి దశలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తున్నామని అన్నారు. రెండో దశలో 2.50 లక్షల కొత్త ఇండ్ల మంజూరుతోపాటు క్యూర్ పరిధిలో లక్ష ఇండ్లను నిర్మిస్తున్నట్టు తెలిపారు. అర్హులైన వారికి కొత్తగా ఫించన్లకు మంజూరు హామీనిచ్చారు. ఎస్సీ వర్గీకరణతో పాటు బీసీలకు విద్య, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్ల కోసం అసెంబ్లీలో బిల్లును ఆమోదించామని, మొత్తం వ్యయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమానికి 12.4 శాతం కేటాయించామని తెలిపారు.

# కళ్యాణలక్ష్మి రద్దుకు కాంగ్రెస్ కుట్ర

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంలో పాలన ఎంత దారుణంగా మారిందో అర్థం చేసుకోవచ్చని అన్నారు. హైకోర్టు తీర్పు మాటున కళ్యాణలక్ష్మి పథకాన్ని రద్దు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని విమర్శించారు. శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ తెలంగాణను ఏఐసీసీకి రాష్ట్ర ప్రభుత్వం ఏటీఎంగా మార్చిందని ఆరోపించారు. తెలంగాణకు వచ్చిన ప్రతిసారీ ప్రధాని మోడీ సైతం రాష్ట్రం ఏఐసీసీకి ఏటీఎంగా మారిందని వ్యాఖ్యానించారని గుర్తుచేశారు. అవినీతిపై మాట్లాడుతున్న కేంద్ర ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని కేటీఆర్ ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో లేదా రాజకీయ వేదికలపై అవినీతి ఆరోపణలు చేయడం వల్ల ప్రజలకు ప్రయోజనం లేదన్నారు. ఆరోపణల్లో వాస్తవం ఉంటే కేంద్ర దర్యాప్తు సంస్థలు నిష్పక్షపాతంగా విచారణ జరిపి నిజాలను ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై గతంలో ఈడీ దాడులు నిర్వహించిందని కేటీఆర్ గుర్తు చేశారు. ఆ తర్వాత ఎలాంటి చర్యలు తీసుకున్నారో, విచారణ ఎక్కడికి చేరిందో ప్రజలకు స్పష్టత లేదన్నారు. పేదవాడు ఇల్లు కట్టుకోవడానికి ప్రభుత్వం నుంచి రూ.ఐదు లక్షలు లేదా రూ.ఆరు లక్షల సాయం పొందాలన్నా కాంగ్రెస్ ప్రభుత్వం వందలాది నిబంధనలు, షరతులు విధిస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలు రూ.వేల కోట్ల అవినీతికి పాల్పడుతున్నారన్న ఆరోపణలు సొంత పార్టీ ఎమ్మెల్యేల నుంచే వస్తున్నాయని అన్నారు. సామాన్యుడి అవసరాలను పట్టించుకోకుండా, అధికారంలో ఉన్నవారి ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వడం ప్రజా పాలన కాదన్నారు. **కుటుంబం కోసమే పనిచేస్తున్న రేవంత్‌రెడ్డి** రోజుకు 18 గంటలు పనిచేస్తున్నానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపదేపదే చెప్తున్నారనీ, ఆయన పనిచేస్తున్నది రాష్ట్రం కోసం కాదని కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. కుటుంబ సభ్యులు, అన్నదమ్ములు, బావమరుదులు, అల్లుడికి భూములు, కాంట్రాక్టులు, నిధులు దోచిపెట్టేందుకే పనిచేస్తున్నారని ఆరోపించారు. ఎనుముల తిరుపతిరెడ్డి, కొండల్‌రెడ్డి తదితరులకుభూములు ఎలా సమకూర్చాలి, వారికి ఎలా సంపద దోచిపెట్టాలి, కుటుంబ సభ్యులు, బంధువులు, అనుచరులకు ఎలా ప్రయోజనాలు కల్పించాలి అన్నదానిపైనే సీఎం దృష్టి ఉందన్నారు. ఎవరి ప్రయోజనాలు కాపాడుతున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. తెలంగాణలో అవినీతి, ప్రజా సంక్షేమం, ప్రభుత్వ పథకాలు, యువత హక్కులు వంటి అన్ని అంశాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం తన వైఫల్యాలను సమీక్షించుకోవాలని సూచించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు, గతంలో అమల్లో ఉన్న సంక్షేమ పథకాలను కొనసాగించాలనీ, అవినీతి ఆరోపణలపై నిష్పక్షపాత విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. రాజకీయ, కుటుంబ ప్రయోజనాలకు పాలనను పరిమితం చేస్తే ప్రజలు తగిన సమయంలో సమాధానం చెప్తారని కేటీఆర్ హెచ్చరించారు. **ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే హైకోర్టు తీర్పు** కళ్యాణ లక్ష్మి పథకాన్ని రద్దు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని కేటీఆర్ విమర్శించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే కల్యాణలక్ష్మి అంశంలో హైకోర్టు తీర్పు వెలువడిందని అన్నారు. లక్షలాది మంది ఆడబిడ్డల జీవితాలకు సంబంధించిన అత్యంత ముఖ్యమైన ఆ పథకంపై స్పందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వానికి సమయం లేకుండా పోయిందా?అని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం అదనంగా ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ఇప్పుడు ఉన్న కల్యాణలక్ష్మి పథకాన్నే నిర్వీర్యం చేసే పరిస్థితికి తెచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. **సంక్షేమ పథకాలకు మంగళం** బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కొక్కటిగా రద్దు చేస్తోందని కేటీఆర్ అన్నారు. కేసీఆర్ కిట్‌ను రద్దు చేశారనీ, కల్యాణలక్ష్మిని నిర్వీర్యం చేస్తున్నారని, షాదీ ముబారక్‌ను పక్కన పెట్టారని, రైతు బీమాను కూడా పట్టించుకోవడం లేదని విమర్శించారు. గత ప్రభుత్వం ప్రారంభించిన పథకాలను రద్దు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రధాన కార్యక్రమంగా మారిందన్నారు. నల్సార్ విద్యార్థుల ఆత్మగౌరవ పోరాటానికి కేటీఆర్ మద్దతు ప్రకటించారు.

ప్రజాస్వామ్యంలో యువత ప్రశ్నించే హక్కును, ఆత్మగౌరవం కోసం నిలబడే హక్కును ప్రతి ఒక్కరూ గౌరవించాలని సూచించారు. విద్యార్థులు ప్రశ్నిస్తే వారిని అణచివేయడం కాకుండా, వారి ప్రశ్నలకు సమాధానం చెప్పడం ప్రజాస్వామ్య వ్యవస్థలో అధికారంలో ఉన్నవారి బాధ్యత అని అన్నారు.

# దేశ భవిష్యత్ ప్రగతికి సరికొత్త దిశానిర్దేశం

(మొదటి పేజీ తరువాయి)

కేవలం చిన్న విడిభాగాల తయారీకే పరిమితం కాకుండా సంపూర్ణ ఉత్పత్తుల తయారీపై భారత్ దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. ప్రపంచ సరఫరా వ్యవస్థలో భారత్‌ను ఒక కీలక భాగస్వామిగా నిలబెట్టేందుకు ధర, నాణ్యత, విస్తృత స్థాయి ఉత్పత్తి అనే మూడు అంశాలపై తయారీదారులు దృష్టి పెట్టాలని సూచించారు. మన ఉత్పత్తులకు ఆకర్షణీయమైన ప్యాకేజింగ్, ఖచ్చితత్వంతో కూడిన నాణ్యత ఐడెంటిటీగా మారాలని చెప్పారు. సప్తధారలో రెండవది వ్యవసాయం, ఆహార భద్రత. దేశ అభివృద్ధి ప్రయాణంలో వ్యవసాయ రంగ ప్రాధాన్యతను నొక్కి చెప్పిన ప్రధాని, ఆర్థిక వృద్ధిలో ఆహార ఉత్పత్తి, వ్యవసాయం ఎప్పటికీ కేంద్రబిందువులుగా ఉంటాయని స్పష్టం చేశారు. సుదీర్ఘకాల ఆహార భద్రతను నిర్ధారించడానికి వ్యవసాయరంగాన్ని బలోపేతంచేసి, ఉత్పాద కతను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. సాంకేతికత, ఆవిష్కరణలు మూడవ ధారగా అభివర్ణించారు. ప్రపంచం డేటాసెంటర్లు, రోబోటిక్స్, సరికొత్త సాంకేతికతల యుగంలోకి అడుగు పెడుతోందని, ఈ రంగాల్లో భారత్ గ్లోబల్ హబ్‌గా మారాలని పిలుపునిచ్చారు. యుపిఐ విజయం ద్వారా భారత్ తన సాంకేతిక సామర్థ్యాన్ని ఇప్పటికే ప్రపంచానికి నిరూపించిందని, ఇప్పుడు మరింత పెద్ద లక్ష్యాలను నిర్దేశించు కోవాలని చెప్పారు. అలాగే నెక్స్ట్-జెన్ టెలికమ్యూనికేషన్‌ను వేగవంతం చేస్తూ, స్వదేశీ 6జి సాంకేతికతను దేశంలోని మూలమూలకూ తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. నాల్గవ ధారగా మౌలిక వసతులు, 'గతి శక్తి' ద్వారా అనుసంధానాన్ని పెంచడంపై మాట్లాడారు. వ్యాపారాన్ని విస్తరించడానికి, ల్యాజిస్టిక్స్ మెరుగు పరచడానికి, వాణిజ్యాన్ని ప్రోత్సహించడానికి రోడ్లు, హైవేలు, ఎక్స్‌ప్రెస్‌వేల అభివృద్ధి అత్యంత కీలకమని, వాటికి నిరంతరం ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. ఈ వేగవంతమైన కనెక్టివిటీ సరికొత్త ఆర్థిక అవకాశాలను తెరుస్తుందన్నారు. ఐదవ ధారగా 'రక్షా శక్తి' నిలిచింది. రక్షణ రంగంలో దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించి, స్వదేశీ తయారీని బలోపేతం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ముఖ్యంగా డ్రోన్లు, కౌంటర్ డ్రోన్ సిస్టమ్స్ వంటి అత్యాధునిక సైనిక సాంకేతికతలపై ఎక్కువ పెట్టుబడులు పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. దేశద్రోహ భద్రతను గట్టిగా ఉంచడానికి ఆత్మనిర్భర్ రక్షణ రంగం ఎంతో అత్యవసరమని తెలిపారు. ఆరవ ధారగా హరిత ఇంధనాన్ని (గ్రీన్ ఎనర్జీ) ప్రధాని గుర్తించారు. పర్యావరణ పరిరక్షణను కాపాడుతూనే భవిష్యత్తు ఇంధన అవసరాలను తీర్చుకోవడానికి క్లీన్ ఎనర్జీ సాంకేతికతల్లో ఆవిష్కరణలు చాలా ముఖ్యం అని చెప్పారు. పునరుత్పాదక ఇంధన రంగాన్ని విస్తరించడానికి, స్వచ్ఛమైన ఇంధన వనరుల వైపు వేగంగా అడుగులు వేయడానికి కృషి చేయాలన్నారు. చివరగా ఏడవ ధారగా భారతదేశం 'సాఫ్ట్ పవర్' ను ప్రధాని ఆవిష్కరించారు. భారత్ సాంస్కృతిక ప్రభావం సరిహద్దులు దాటి విస్తరించిందని చెబుతూ.. యోగా, హస్తకళలు, సినిమాలు, యానిమేషన్, గేమింగ్, డిజిటల్ కంటెంట్, క్రియేటివ్ రంగాలు భారత సాఫ్ట్ పవర్‌కు ప్రధాన స్తంభాలని వెల్లడించారు. భారతదేశ పర్యాటక రంగానికి భారీ అవకాశాలు ఉన్నాయని, విదేశీ పర్యాటకులను ఆకర్షించేందుకు మరింత కృషి చేయాలని కోరారు. జాతీయ పార్కులు, సాంస్కృతిక విశేషాలు, వినోద పరిశ్రమ, వేగంగా విస్తరిస్తున్న 'కాన్సర్ట్ ఎకానమీ' పర్యాటకాన్ని బలోపేతం చేయడానికి, భారత్ గొప్ప వారసత్వాన్ని ప్రపంచానికి చాటిచెప్పడానికి అద్భుతమైన వేదికలని మోడీ స్పష్టం చేశారు. ఈ సప్తధార సంస్కరణలు భారత ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడమే కాకుండా, 2047 నాటికి దేశాన్ని సంపూర్ణ స్వయంసమృద్ధి కలిగిన వికసిత్ భారత్‌గా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు.

# భారత్ ప్రత్యేక గౌరవాన్ని సంపాదించుకుంది

**న్యూఢిల్లీ, 15 :** భారత్ సాధిస్తున్న ప్రగతిని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రశంసించారు. ఆర్థిక, సామాజిక, శాస్త్ర, సాంకేతిక రంగాల్లో భారత్ అద్భుతమైన విజయాలు సాధిస్తోందని అన్నారు. ప్రపంచ వేదికపై భారత్ తనకంటూ ప్రత్యేక గౌరవాన్ని సంపాదించుకుందని పేర్కొన్నారు. భారత 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని నరేంద్ర మోడీకి పుతిన్ శుభాకాంక్షలు తెలిపారు. భారత్, రష్యా దేశాల మధ్య సంబంధాలు ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్య స్ఫూర్తితో ముందుకు సాగుతున్నాయని పుతిన్ చెప్పారు. ఐక్యరాజ్యసమితి, ఎస్‌సీఓ, బ్రిక్స్ వంటి అంతర్జాతీయ వేదికల్లో రెండు దేశాలు కలిసి పనిచేస్తున్నాయని తెలిపారు. ఇరుదేశాల ప్రజల ప్రయోజనాల కోసం ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు కృషి కొనసాగుతుందని పేర్కొన్నారు. అంతర్జాతీయ భద్రత, స్థిరత్వానికి కూడా ఈ భాగస్వామ్యం ఉపయోగపడుతుందని అన్నారు. భారత అభివృద్ధి ప్రయాణానికి రష్యా అండగా ఉంటుందని రష్యా రాయబారి డెనిస్ అలిపోవ్ చెప్పారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా భారత ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. భారత్ ముందుకు సాగుతున్న తీరును చూస్తే ప్రజల కలలన్నీ నెరవేరుతాయనే నమ్మకం ఉందన్నారు. రష్యా మద్దతు భవిష్యత్తులోనూ కొనసాగుతుందని స్పష్టంచేశారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం నుంచి రష్యా వ్యోమగాములు ప్యోటర్ దుబ్రోవ్, అన్నా కికీనా, ఆంద్రే ఫెద్యాయెవ్ కూడా భారత ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

# చరిత్ర తెలుసుకుంటేనే ...భవిష్యత్ నిర్మాణం

(మొదటి పేజీ తరువాయి)

అఘాయిత్యాలు, విభజించి పాలించిన విధానం అందరికీ తెలియాల్సిన అవసరం ఉందన్నారు. రెండు ప్రపంచ యుద్ధాలకు భారతీయులను సైనికులుగా వాడుకొని ఎంతో మంది చావులకు కారణమయ్యారని మండిపడ్డారు. బ్రిటీష్ వాళ్లు వచ్చిన తర్వాతే కుల వ్యవస్థ మరింత పెరిగిందని వ్యాఖ్యానించారు. అడవుల్లో ఉండే ఆదివాసీలను రాజ్యం పరిధిలోకి తెచ్చి తీరని అన్యాయం చేశారన్నారు. బ్రిటీష్ పరిపాలన పోయినప్పటికీ వాళ్ల ఆలోచనా విధానాన్నే ఇప్పటికీ అమలు చేస్తున్నారని కవిత విమర్శించారు. ఇంగ్లీష్ మాట్లాడిన వాళ్లే గొప్ప అన్నట్లుగా చూస్తున్నారని.. తెలుగు భాష మాట్లాడితే తక్కువ చేసి చూస్తున్నారని మండిపడ్డారు. 'తెల్ల తోలు గొప్ప, నల్ల తోలు కాదన్నట్లుగా ప్రచారం చేసి మనలో మనల్ని శత్రువులను చేశారు' అని అన్నారు. ఆనాటి బ్రిటీష్ వాళ్ల పరిపాలన, ఆలోచనా విధానాన్ని వీడాలని కవిత పేర్కొన్నారు.

# కేసీఆర్..సాగుపై చర్చకు సిద్ధమా?

(మొదటి పేజీ తరువాయి)

ఎనుముల రేవంత్‌రెడ్డి చాలెంజ్ చేశారు. శనివారం సంగారెడ్డిలో కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ స్టేడియం గ్రౌండ్స్ లో నిర్వహించిన సభలో లబ్దిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్మార్ట్ రేషన్ కార్డు కేవలం ఒక కాగితం కాదని, పేదల ఆకలి తీర్చే ఆత్మగౌరవానికి ప్రతీక అన్నారు. పేదలకు నిత్యావసర సరుకులు అందించేందుకు రేషన్ షాపులను ఏర్పాటు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో ఏ ఒక్క పేదవాడు ఆకలితో అలమటించకూడదన్నదే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. సన్నబియ్యం, ఇందిరమ్మ ఇండ్లు, ఆరోగ్యశ్రీ వంటి సంక్షేమ కార్యక్రమాలపై ప్రతిపక్షాలు మాట్లాడుతున్నాయని, పేదల సంక్షేమం కోసం గతంలో వారు ఏం చేశారో ప్రజలు ఆలోచించాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే కరెంటు ఉండదని గతంలో విమర్శలు చేసిన వారు ఇప్పుడు వాస్తవాలను చూడాలని హితవు పలికారు. రాష్ట్రంలో రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తున్నామన్నారు. సన్నధాన్యానికి రూ.500 బోనస్, రైతు భరోసా రూ.12 వేల చొప్పున రూ.36 వేల కోట్లను70 లక్షల మంది రైతుల ఖాతాల్లో జమ చేశామని చెప్పారు.

## సిద్ధిపేటలో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసిన మంత్రి పొన్నం

(మొదటి పేజీ తరువాయి)

ప్రారంభించారని, మనం సిద్దిపేట లో లాంఛనంగా స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ ప్రారంభించుకుంటున్నామని అన్నారు. గతంలో కొత్తగా పెళ్లి అయిన రేషన్ కార్డులు వచ్చేవి కావని, ప్రజా పాలన ప్రభుత్వం అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ కొత్తగా 16 లక్షల రేషన్ కార్డులు పంపిణీ చేసిందన్నారు. ఇది నిరంతర ప్రక్రియ.. 365 రోజులు కొనసాగుతుందని రేషన్ కార్డులతో పాటు ఒక్కొకరికి ఆరు కిలోల చొప్పున సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామన్నారు. గత 10 సంవత్సరాలుగా తమకు రేషన్ కార్డు రాలేదని గత ఏడాది ప్రజా ప్రభుత్వం రాగానే తమకు రేషన్ కార్డు వచ్చిందని,రేషన్ కార్డు రాగానే ఒక్కొకరికి ఆరు కిలోల చొప్పున సన్న బియ్యం పొందుతున్నామని లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హైమవతి ,అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్ , పద్మశాలి ఫెడరేషన్ చైర్మన్ గూడూరి శ్రీనివాస్ ,లైబ్రరీ చైర్మన్ ధరిపల్లి చంద్రం , ఎస్సీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకయ్య, ఆర్టీఏ మెంబర్ సూర్య వర్మ , మార్కెట్ కమిటీ చైర్మన్ లు ,వివిధ గ్రామాల సర్పంచ్ లు, తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగులకు తీపి కబురు

(మొదటి పేజీ తరువాయి)

దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. టిజిపిఎస్‌సి చైర్మన్ బుర్రా వెంకటేశం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి ప్ర సంగించారు. వచ్చే వారం నుంచి వరుస నోటిఫికేషన్లు జారీ చేసేందుకు చర్యలు వేగవంతం చేసినట్లు వెల్లడించారు. ఉద్యోగార్థుల భవిష్యత్తును దృ ష్టిలో ఉంచుకుని నియామక ప్రక్రియలోని ప్రతి ద శలోనూ సిబ్బంది అత్యంత జాగ్రత్తగా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని చైర్మన్ సూచించా రు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ఆర్టిఫిషి యల్ ఇంటెలిజెన్స్, బ్లాక్‌చైన్ వంటి ఆధునిక డిజిటల్ సాంకేతికతలను పరీక్షలు, ఫలితాల ప్రక్రియలో వినియోగించనున్నట్లు వెల్ల డించారు. నిరుద్యోగ యువత నమ్మకాన్ని నిలబెడుతూ ఉద్యోగాల భర్తీ చేపడతామని స్పష్టం చేశారు. కమిషన్ సభ్యులు డాక్టర్ అమీర్‌ఉల్లాఖాన్, రజనీ కుమారి, సి.చంద్రకాంత్ రెడ్డి, ప్రొ ఎల్.బి. లక్ష్మీకాంత్ రాథోడ్, కార్యదర్శి ఎం.హరితలతో పాటు పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజల అవసరాలు గుర్తించి సంక్షేమ పాలన

(మొదటి పేజీ తరువాయి)

పూర్తిగా అరికట్టేందుకు ఈ కొత్త స్మార్ట్ కార్డులలో ఎన్క్రిప్టెడ్ క్యూఆర్ కోడ్, ప్రత్యేక హోలోగ్రామ్, వాటర్ మార్క్, యూవీ లోగో సహా 9 రకాల పటిష్టమైన భద్రతా ఫీచర్లను పొందుపరిచామని భట్టి అన్నారు. ఈ-పాస్ యంత్రాలతో బయోమెట్రిక్ విధానాన్ని అనుసంధానించి రేషన్ పంపిణీలో నూరు శాతం పారదర్శకతను తీసుకువస్తున్నామన్నారు. రాష్ట్రంలోని ప్రతి నిరుపేద కుటుంబానికి ఆహార భద్రత కల్పించడమే లక్ష్యంగా 3.42 కోట్ల మందికి నెలకు 6 కిలోల చొప్పున సన్న బియ్యాన్ని ఉచితంగా అందిస్తున్నాం. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఈ సరికొత్త డిజిటల్ కార్డులు మంజూరు చేస్తూ, వాటి ద్వారా అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేస్తున్నాం. పేదలకు మెరుగైన వైద్యం కోసం రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచడంతో పాటు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్ల ద్వారా సొంతింటి కల సాకారం, మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం వంటి పథకాలతో ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమే మన ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అన్నారు. తెలంగాణను దేశంలోని ఇతర రాష్ట్రాలతోనే కాకుండా, ప్రపంచంలోని అభివృద్ధి చెందిన దేశాలతో పోటీపడే స్థాయికి తీసుకెళ్లేలా మన ప్రభుత్వం అడుగులు వేస్తోందని భట్టి తెలిపారు. మహిళా సాధికారతకు కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో పాటు, స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామని పేర్కొన్నారు.

# సంపాదకీయం



## హుందాతనం కోల్పోతున్న రాహుల్ !

రాజకీయాల్లో హుందాతనం అవసరం. సమయానుకూలంగా మంచిగా మాట్లాడేలా వ్యవహరించాలి. సమస్యలపై అవగాహన ఉండాలి. అందులోనూ ప్రతిపక్షనేతగా ఉన్న వ్యక్తికి ఇవన్నీ అవసరం. ప్రతిపక్ష నేతగా సమర్థత ఉంటేనే రాణిస్తారు. అధికారంలో ఉన్నప్పుడు ఎలాగైనా చెల్లుతుంది. కానీ ప్రతిపక్షనేతగా రాణించాలంటే ప్రజల్లో తన వ్యక్తిత్వం కూడా పెంచుకోవాల్సి ఉంటుంది. మాటలు, చేతలు అన్నీ హుందాగా ఉండేలా చూసుకోవాల్సి ఉంటుంది. లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ ఈ మధ్య మరీ దిగజారి పోయారు. మాటల్లో హుందాతనం లేదు. చేతల్లో అంతకన్నా లేకుండా పోయింది. సర్కస్‌లో జోకర్‌లా, డ్రామాల్లో విదూషకుడిలా ఆయన ప్రవర్తిస్తున్న తీరు జుగుప్స కలిగిస్తోంది. లోక్‌సభలో మాట్లాడాల్సిన సమయంలో మాట్లాడరు. మాట్లాడితే పస ఉండడం లేదు. సమస్యలపై అవగాహన ఉండడం లేదు. విషయంపై పట్టు ఉండడం లేదు. ఇవన్నీ కలగలిపి రాహుల్ గాంధీ విపక్ష నేతగా పూర్తిగా విఫలం అవుతూ వస్తున్నారు. ఇటీవల వరుసగా పార్లమెంట్ సమావేశాలు దెబ్బతినడానికి ప్రధాన కారణం కూడా రాహుల్ అన్న విషయం మరచిపోరాదు. తాజాగా ఆయన చేసిన వ్యాఖ్యలు ఆయన ఎంతగా దిగజారిపోయారో అనడానికి నిదర్శనంగా నిలిచాయి. ఆలింగనాలే ప్రధాన మంత్రి మోదీ విదేశీ దౌత్యం అంటూ... లోక్‌సభ విపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు..ఆయన ఆహార్యం సామాన్యులకు కూడా వెగటు పుట్టించేలా ఉన్నాయి. అహంకారం హద్దులు దాటి రాహుల్ నోరుజారుతున్నారనడానికి ఇంతకన్నా నిదర్శం అక్కర్లేదు. ఇది ఓ రకంగా భారత ప్రతిష్ఠను దిగజార్చేలా ఉంది. ఇలాంటి ప్రతిపక్ష నేతను గతంలో ఎప్పుడూ చూడలేదని రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ చేసిన వ్యాఖ్యలు ముమ్మాటికీ నిజం. ఎందుకంటే భారత దౌత్యంపై రాహుల్ చేసినవి దిగజారుడు వ్యాఖ్యలు చూశాక ఇలాంటి ప్రతిపక్ష నేత ఉన్నందుకు దేశ ప్రజలు సిగ్గుపడాలి. ఆయన ప్రవర్తన ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం. రాహుల్ వ్యాఖ్యలు విదేశాల్లో భారత్ ప్రతిష్ఠను దిగజార్చేలా ఉన్నాయి. ఎందుకంటే రాహుల్ అహంకారంతో చేసిన వ్యాఖ్యలు వ్యవహరించిన తీరు పిచ్చిగా మారుతోందనడానికి చెప్పడానికి సిగ్గుపడాల్సిన పనిలేదు. భావి భారత ప్రధాని అని కాంగ్రెస్ శ్రేణులంతా పొగడుతున్న వేళ..ఆయన భాషను, ఆహార్యాన్ని చూస్తుంటే..ఇతనూ ఒక నేతేనా అన్న సందేహం కలుగక మానదు. ఇలాంటి వారిచేతిలో భారత్ పదిలంగా ఉండగలదా అన్న భయం కలుగుతోంది. భారతదేశాన్ని నడపడానికి సుదీర్ఘ అనుభవం కావాలి. పనికిమాలిన నాటకాలు కాదు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని జోకర్లని పిలవడం, మోడీని, అమిత్ షాలను కట్టగట్టి తిట్టడం పరిధికి మించిన విషయం. రాహుల్ వాడుతోన్న భాష మూర్ఖత్వాన్ని, నిరాశను తెలిజేస్తున్నాయి. ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీని ఉద్దేశించి రాహుల్ చేసిన వ్యాఖ్యలు దిగజారుడు రాజకీయాలకు పరాకాష్టగా చెప్పుకోవాలి. అలాగే విదేశాల్లో వివిధ నేతలతో మోడీ ఆలింగనాలపైనా కువ్యాఖ్యలు చేశారు. నిజానికి ఓ ప్రతిపక్షనేతగా ఉన్న వ్యక్తి విదేశీ నాయకులపై రాజకీయ వ్యాఖ్యలు చేసేటప్పుడు గౌరవప్రదమైన వైఖరి ప్రదర్శించాల్సి ఉంటుంది. తానొక విపక్షనేతను అన్నది మరచి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఆయన దిగజారుడు రాజకీయాలకు పారాకాష్టగా చూడాలి. రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర తరవాత ఆయన నాయకత్వం పట్ల ప్రజల్లో కొంత విశ్వసనీయతను పెంపొందించిందనడంలో సందేహం లేదు. ఆ యాత్రతో ఆయన ప్రజల మనిషిగా మారడానికి తపించారు. అయితే సార్వత్రక ఎన్నికల అనంతరం కాంగ్రెస్‌ను మళ్లీ ఒక కుటుంబ వ్యవస్థగా మార్చేయడంతో భారత్ జోడో యాత్ర నాటి ఆదర్శం లేకుండా పోయింది. ఇప్పుడు జన్‌జి అంటూ మాట్లాడుతున్న రాహుల్ వారికి పార్టీలో అవకాశం ఇవ్వలేక పోయారు. ప్రియాంకగాంధీని వయనాడ్ నుంచి లోక్‌సభకు ఎన్నిక చేయించుకున్నారు. తల్లి సోనియాను రాజ్యసభకు పంపారు. తాను రాయబరేలి నుంచి ఎన్నికయ్యారు. ఇది కుటుంబ పార్టీ అనకుండా ఎలా ఉండగలం. వృద్దనేతలంతా కాంగ్రెస్‌లో పాతుకు పోయారు. యువ నేతలను దరిచేరనీయకుండా చూసుకుంటున్నారు. వీరు జన్‌జీ గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉంది. తాను దక్షిణాదికి ప్రాతినిధ్యం వహిస్తున్నానని, తన సోదరుడు ఉత్తరాదికి ప్రాతినిధ్యం వహిస్తున్నాడని, తద్వారా తాము ఈ సువిశాల దేశాన్ని సమైక్యం చేస్తున్నామని ప్రియాంక చెప్పుకోవడం సిగ్గుచేటు. 2024 సార్వత్రక ఎన్నికలలో 99 సీట్లు గెలుచుకుని కాంగ్రెస్ ప్రధాన ప్రతిపక్షంగా ఆవిర్భవించడంతో రాహుల్ విధేయులు ఆయనను కాబోయే ప్రధానమంత్రి అని కీర్తించడం ప్రారంభించారు. కొందరు మేధావులు, పాత్రికేయులు కూడా ఆ కీర్తనకు వంతపాడుతూ వచ్చారు. రెండు సంవత్సరాల తరువాత ఇప్పుడు వెనుతిరిగి చూస్తే అంత సీన్ రాహుల్‌కు లేదని అనిపిస్తోంది. తాజాగా రాహుల్ చేష్టలు, వ్యాఖ్యలు ఆయనలో నాయకత్వ పటిమ లేదని నిరూపించాయి. దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో కాంగ్రెస్ క్రమంగా వెనుకపడిపోతోంది. కాంగ్రెస్ పతనాన్ని రాహుల్‌గాంధీ నిలువరించలేక పోతున్నారు. ప్రధానమంత్రి పదవి విషయంలో నరేంద్ర మోదీతో పోలిస్తే .. రాహుల్‌లో క్రమశిక్షణ, హుందాతనం, విద్యార్హతలు, నాయకత్వ నైపుణ్యాలు ఎక్కడా కనిపించవు. సమయానుకూలంగా ఏదో ఓ సమస్యపై మాట్లాడడం, విదేశాలకు చెక్కేయడం అలవాటు చేసుకున్నారు. అక్కడా భారత పరువు పోయేలా మాట్లాడడం కూడా అలవాటు చేసుకున్నారు. 'ఓటు చోరీ'పై ఇలాగే చేశారు. ప్రతిపక్ష నేతగా ప్రధాని కన్నా ఎక్కువ కష్టపడాలి. ఎక్కువగా కృషి చేయాలి. యూపీఏ అధికారంలో ఉన్న పది సంవత్సరాలలో రాహుల్ మంత్రిపదవిని చేపట్టేందుకు అంగీకరించలేదు. దీంతో ఆయనకు అధికారంలో ఉండడం ఎలా అన్నది కూడా తెలియదు. ప్రస్తుత కల్లోల అంతర్జాతీయ పరిస్థితులలో ఈ సువిశాల దేశానికి ప్రభావశీల ప్రధానమంత్రి కాగలరని భారతీయ ఓటర్లు మాత్రం ఎలా నమ్ముతారు. గతంలో చేసిన తప్పుల నుంచి పాఠాలు నేర్చుకోలేని రాహుల్, ఇప్పటికీ పదేపదే అవే తప్పులు చేయడంతో పాటు, రాజకీయ హుందాను కోల్పోతున్నారు. 2019లో మోదీకి వ్యతిరేకంగా రాహుల్ నిర్వహించిన 'చౌకీదార్ చోర్' ప్రచారం ఘోరంగా విఫలమవడమే కాకుండా కాంగ్రెస్‌నే ఎదురు దెబ్బతీసింది. అయినప్పటికీ పాలనా వైఫల్యాలు లేదా తన సొంత పార్టీని గ్రామస్థాయి నుంచి పటిష్ఠం చేయడంపై దృష్టి పెట్టకుండా ప్రధాన మంత్రిపై వ్యక్తిగత విమర్శలు చేయడం ద్వారా మరింతగా దిగజారిన నేతగా ప్రజల్లో చులకన భావం మూటకట్టుకుంటున్నారు. ఇలాంటి వ్యక్తి నిజసానికి ప్రతిపక్ష నేతగా కూడా పనికిరాడు. ఇక ప్రధానిగా కావాలనుకంటున్న ఇతనికి వందిమాగధులు చేస్తున్న పొగడ్తలతో ఉబ్బిపోవడం తప్ప మరోటి తెలియడం లేదు. స్వయం ప్రకటితంగా ఇక తానే భావి ప్రధాని అనుకోవడంతో వచ్చిన మానసిక వైకల్యంగా చూడాలి. వీటిని అధిగమించితే తప్ప సమర్థనేతగా

# ఎర్రకోటపై జెండా ఎగరేసిన ప్రధాని మోడీ

**వరుసగా 13వసారి జెండా ఆవిష్కరణ**

**తొలిసారిగా పూర్తిస్థాయి వందేమాతర గీతాలపన**

**పూలవర్షం కురిపించిన వాయుసేన హెలికాప్టర్లు**



**న్యూఢిల్లీ,ఆగస్ట్15:** దేశవ్యాప్తంగా 80వ స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. రాజధాని దిల్లీలో ఎర్రకోటపై ప్రధాని మోదీ జాతీయ జెండా ఎగురవేశారు. దిల్లీలోని ఎర్రకోటపై మోదీ వరుసగా 13వ సారి జాతీయ జెండా ఎగురవేశారు. దేశ చరిత్రలో తొలిసారిగా వందేమాతరం గేయాన్ని పూర్తిగా ఈ వేడుకల్లో ఆలపించారు. అనంతరం జాతీయ గీతం 'జనగణమన'ను ఆలపించారు. ఆ సమయంలో వాయుసేన పూలవర్షం కురిపించింది. ఒక హెలికాప్టర్ జాతీయ పతాకాన్ని.. మరొకటి 'వందేమాతరం' అని రాసి ఉన్న జెండాను మోసుకెళ్లాయి. 'వందేమాతరం' గేయానికి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా గతేడాది నవంబర్ 7 నుంచి ఏడాది పాటు కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతోన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే జాతీయ గీతం 'జన గణ మన'తో పాటు వందేమాతరానికి ప్రభుత్వం సమాన హోదా కల్పిస్తూ చట్టం చేసింది. ఈ చట్టం ప్రకారం.. 'వందేమాతరం'ని అవమానించినా, ఆలపిస్తున్న సమయంలో ఆటంకం కలిగించినా ఇకపై చట్టరీత్యా నేరంగా పరిగణిస్తారు.స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రముఖ సెర్చ్ ఇంజిన్ సంస్థ గూగుల్ ప్రత్యేక డూడుల్‌ను రూపొందించింది. ఇది భారతీయ వస్త్ర కళలు, సంస్కృతీ సంప్రదాయాలు, వైవిధ్యాన్ని చాటిచెబుతోంది. 22 విభిన్న ప్రాంతీయ వస్త్ర సంప్రదాయాలను తెలియజేసే డిజైన్‌లు అందులో కనిపిస్తున్నాయి. చేతితో నేసిన ఈ వస్త్రాల డూడుల్ దేశవ్యాప్తంగా ఉన్న నేత కార్మికులు, రైతులు, బ్లాక్-ప్రింటర్ల సామూహిక శ్రమను ప్రతిబింబిస్తోంది. జెండా ఎగురవేయడానికి ముందు ప్రధాని మోదీ రాజ్‌ఘాట్ వద్ద మహాత్ముడికి నివాళులు అర్పించారు. అనంతరం ఎర్రకోట వద్ద గౌరవవందనం స్వీకరించి త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ వేడుకలు ప్రారంభమైన సమయంలో వాయుసేన పూలవర్షం కురిపించింది. స్వాతంత్ర్య దినోత్సవం రోజున మోదీ జెండా ఎగురవేయడం ఇది 13వసారి కావడం విశేషం. జెండా ఎగురవేసిన అనంతరం ఆయన దేశ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. 'ఈ రోజు మనమంతా 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకొంటున్నాం. ప్రతి హృదయంలో 'వందేమాతరం' ధ్వనిస్తోంది. ప్రతి ఇంట్లో త్రివర్ణ పతాకం రెపరెపలాడుతోంది. కొత్త తీర్మానాలతో సరికొత్త ఉత్సాహంతో దేశం ముందుకు సాగుతోంది. గతంలో ఐదు బలహీన దేశాల జాబితాలో ఉన్న భారత్.. 12 ఏళ్ల తర్వాత ఇప్పుడు వేగంగా అభివృద్ధి చెందుతోన్న ఆర్థిక వ్యవస్థగా మారింది' అని మోదీ అన్నారు.

# భారత్‌కు ప్రపంచస్థాయి నాయకత్వ లక్షణం

**అన్ని రంగాల్లో దూసుకు పోయే తత్వం**

**సత్తా చాటగల నైపుణ్యాలు మన సొంతం**

**యువత ఓ గంట సమయం కేటాయిస్తే చాలు**

**జనగణనలో ఖచ్చితమైన సమాచారం ఇవ్వండి**

**దానితోనే దేశ అభివృద్ధి ప్రణాళికలు రచించగలం**

**ఎర్రకోట నుంచి ప్రధాని మోడీ పిలుపు**

**ఎర్రకోట వేడుకలకు దూరంగా రాహుల్, ఖర్గే**



**న్యూఢిల్లీ,ఆగస్ట్15:** భారత్‌కు ప్రపంచస్థాయి నాయకత్వ లక్షణాలు ఉన్నాయని, అన్నిరంగాల్లో దూసుకుపోయే సమర్థత ఉందని ప్రధాని మోదీ అన్నారు. సవాళ్లు స్వీకరించి ముందుకు సాగడం ద్వారా మనమేంటో సత్తా చూసగలమన్నారు. ఎర్రకోట వేదికగా ప్రధాని మోదీ యువత లక్ష్యంగా పలు కార్యక్రమాలను ప్రకటించారు. కోటి మంది యువతకు ఏఐ నైపుణ్యాలలో శిక్షణ ఇస్తామని, పోటీ పరీక్షలకు ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ అందిస్తామన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలపై ఉన్న ఆర్థిక భారాన్ని తగ్గించడమే.. ఉచిత కోచింగ్ కార్యక్రమ లక్ష్యమని చెప్పారు. అలాగే ప్రస్తుతం దేశంలో జరుగుతోన్న జనగణన గురించి ప్రస్తావించారు. దానిలో యవత చురుగ్గా పాల్గొనాలని మోదీ పిలుపునిచ్చారు.'నేను అందరినీ ఒక ఫేవర్ చేయాలని అడుగుతున్నాను. ఒక గంటా, రెండు గంటల సమయం కేటాయించండి. అది దేశానికి ఎంతో ఉపయోగపడుతుంది. ఆ మాత్రం సమయం దేశాన్ని ఎలా బలోపేతం చేస్తుందా..? అని యువత ఆలోచిస్తూ ఉండొచ్చు. వారి భాగస్వామ్యంతో ప్రతి ఇంట్లో జనాభా గణనకు ఒక అనుకూల వాతావరణం ఏర్పడేందుకు అవకాశం ఉంటుంది. గణన అంటే లెక్కలన్నీ ఒక దగ్గర రాసుకోవడం కాదు. జనాభా లెక్కల సమయంలో ప్రజలు ఇచ్చే వివరాల ఆధారంగానే జాతీయ విధానాలు, పథకాలు రూపుదిద్దుకుంటాయి. దేశ ప్రగతికి ఆ లెక్కలు సూచీగా ఉంటాయి. అందుకే కచ్చితమైన, స్పష్టమైన సమాచారం ఇవ్వడం అత్యంత కీలకం అని మోదీ పేర్కొన్నారు. అలాగే 'దిమాగీ నక్సల్స్' గురించి మాట్లాడుతూ.. వారిని దేశానికి కొత్త శత్రువులుగా అభివర్ణించారు. 'సంవత్సరాలుగా మావోయిస్టు భావజాలం ఉన్న వ్యక్తులు దేశంలో బలంగా పాతుకుపోయారు. అడవుల్లోని సాయుధ నక్సల్స్‌ను నిర్మూలించి, ఆ సంక్షోభం నుంచి దేశాన్ని విముక్తి చేయడంలో ప్రభుత్వం విజయం సాధించింది. సాయుధ నక్సల్స్ కనుమరుగైనా.. 'దిమాగీ నక్సల్స్' మిగిలి ఉన్నారు. వారు ఒక అవకాశం కోసం ఎదురు చూస్తున్నారు. సమాజాన్ని తప్పుడు మార్గంలోకి లాగడానికి వారు కొత్త ఎత్తుగడలు వేస్తున్నారు. మనం వారిని గుర్తించి.. ఏకాకిని చేయాలని సూచించారు. తయారీ, వ్యవసాయం, సాంకేతికత, మౌలిక సదుపాయాలు, రక్షణ రంగం, గ్రీన్ అండ్ బ్లూ ఎకానమీ, ఇండియాస్ సాఫ్ట్ పవర్ కోసం 'సప్తధార' రోడ్‌మ్యాప్‌ను మోదీ ప్రకటించారు. మహిళా కోటా బిల్లుపై ప్రతిష్టంభన నెలకొన్న నేపథ్యంలో.. తన ప్రసంగంలో దాని ప్రస్తావన తీసుకువచ్చారు. ప్రతిపక్షాలు విభేదాలను పక్కనపెట్టి.. పార్లమెంట్, శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు సహకరించాలని కోరారు. క్రెడిట్ వారే తీసుకున్నా ఫర్వాలేదని, కానీ బిల్లు పాసయి మహిళలకు గౌరవం దక్కాలన్నదే తన ఆకాంక్ష అన్నారు. భారత్ ఇకపై చిన్న కలలతో ముందుకు వెళ్లలేదని, ఆలోచనా పరిధి విస్తృతం చేసుకునేందుకు ఉన్నత లక్ష్యాలు అవసరమని మోదీ పిలుపునిచ్చారు. భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా మారినప్పుడు ప్రపంచం మన వైపు చూసే తీరే మారుతుందని పేర్కొన్నారు. ఇతర దేశాలపై ఆధారపడి జీవించలేమని, స్వయం సమృద్ధి సాధించాలన్నారు. టెక్ ప్రపంచంలో చిప్‌ల విలువను భారతదేశం అర్థం చేసుకుంటోందని, అందుకే మూడు సెమీకండక్టర్ ప్లాంట్లను ఏర్పాటు చేసిందని తెలిపారు. సమీప భవిష్యత్తులో మరిన్ని సెమీకండక్టర్ ప్లాంట్లను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఇప్పుడు ప్రతిభారతీయుడు స్థానిక ఉత్పత్తులకు మద్దతు ఇవ్వడంపై సంతోషం వ్యక్తంచేశారు. తమ ప్రభుత్వ హయాంలో 25 కోట్లమంది పేదరికం నుంచి బయటపడ్డారని తెలిపారు. అభివృద్ధి దిశగా దృఢ సంకల్పంతో పయనిస్తోన్న 140 కోట్ల మంది భారతీయులను ఆపడం అసాధ్యం అని పేర్కొన్నారు. దేశంలోని పలు ప్రాంతాల్లో ఇటీవల సంభవించిన విపత్తుల గురించి ప్రస్తావించారు. బాధిత కుటుంబాలకు దేశం మొత్తం అండగా ఉంటుందని సంఘీభావం తెలిపారు. దేశంలో 70 నగరాల్లో పైప్‌లైన్ ద్వారా గ్యాస్ అందిస్తున్నాం. 1.75 కోట్ల ఇళ్లకు పైప్ ద్వారా వంటగ్యాస్ సరఫరా చేస్తున్నాం. ఇంధన భద్రత సాధించడం దేశ తక్షణ అవసరం. వంద గిగావాట్ల అణు ఇంధనం సాధించడం మనలక్ష్యం అన్నారు. ఇటవలే హైడ్రోజన్ రైలును విజయంతంగా నడిపించాం. 90 ఏళ్లలో 30 శాతం మాత్రమే రైళ్ల ఎలక్ట్రిఫికేషన్ జరిగింది. 10 ఏళ్లలో 70 శాతం రైళ్ల ఎలక్ట్రిఫికేషన్ పూర్తి చేశాం. ఇటీవలే హైడ్రోజన్ రైలును విజయవంతంగా నడిపించామని అన్నారు. 50 లక్షల ఇళ్లకు సౌరశక్తి విద్యుత్ అందిస్తున్నాం. దేశంలో ఐదు న్యూక్లియర్ రియాక్టర్లు ఏర్పాటు చేస్తున్నామని మోదీ తెలిపారు.అయితే స్వాతంత్ర్య వేడుకల్లో ఈసారి కూడా లోక్‌సభ, రాజ్యసభల్లో విపక్ష నేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే హాజరుకాలేదు. సీటింగ్, ఇతర ప్రొటోకాల్స్ వారి పదవులకు అనుగుణంగా ఉండటం లేదని కాంగ్రెస్ గతంలో ఆరోపించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే వారు వరుసగా రెండోసారి గైర్హాజరయ్యారు.

# ఆదిలాబాద్ జిల్లాలో ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు



**నార్నూర్ :** ఆదిలాబాద్ జిల్లా నార్నూర్, గాదిగూడ మండలంలో 80 వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి జాతీయ గీతాన్ని ఆలపించారు.వేడుకల సందర్భంగా ఆటల పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్లు జాడి రాజా లింగం, సత్యనారాయణ, ఎంపీడీవో లు పుల్లారావు, శ్రీనివాస్, ఎస్సైలు శ్రీ సాయి, రమ్య, సర్పంచ్ బానోత్ కావేరి, తోడసం రేణుక, ఉప సర్పంచ్ మహ్మద్ ఖురేషి, ప్రజా ప్రతినిధులు, హాయ్ శాఖల అధికారులు, సిబ్బంది, ప్రధానోపాధ్యాయులు, నాయకులు, యువకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# టేక్మాల్‌లో జాతీయ జెండాకు అవమానం

## తలకిందులుగా ఎగుర వేసిన సర్పంచ్

**టేక్మాల్:** మండల కేంద్రమైన టేక్మాల్ ( గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో అపశృతి దొర్లింది. స్థానిక సర్పంచ్ సుధాకర్ జాతీయ జెండా ను తలకిందులుగా ఎగురవేయడం స్థానికంగా కలకలం రేపింది. స్వాతంత్ర్య దినోత్సవంలో భాగంగా పంచాయతీ ఆవరణలో జెండా వందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో సర్పంచ్ సుధాకర్ జాతీయ జెండాను ఎగురవేసే సమయంలో కాషాయం కిందికి, ఆకుపచ్చ పైకి ఉండేలా తలకిందులుగా ఎగురవేశారు. ఈ దృశ్యాన్ని చూసిన ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు విస్మయానికి గురయ్యారు. పొరపాటును గమనించిన కొద్దిసేపటికే నిర్వాహకులు జెండాను దించి, సరైన క్రమంలో తిరిగి ఎగురవేశారు.




జాతీయ జెండా దేశ గౌరవానికి ప్రతీక అని, బాధ్యతయుతంగా వ్యవహారించాల్సిన విషయంలో నిర్లక్ష్యం తగదని స్థానికులు పేర్కొన్నారు.

## నెలాఖరులోగా మారేళ్లపాడు ఎత్తిపోతల పథకం పూర్తి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**భద్రాద్రి కొత్తగూడెం:** రాజీవ్ లింక్ కెనాల్‌కు గోదావరి జలాలను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విడుదల చేశారు. అశ్వాపురం మండలం సీతారామ పంప్ హౌస్ వద్ద మంత్రి తుమ్మల, ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు.. మోటార్ స్విచ్ ఆన్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు సరిగ్గా లేక పంటల సాగుకు ఇబ్బందులు ఏర్పడ్డాయని తెలిపారు. రాజీవ్ లింక్ కెనాల్ ద్వారా గోదావరి జలాలు.. సాగర్ ఆయకట్టుకు భరోసాగా మారిందన్నారు. మారేళ్లపాడు ఎత్తిపోతల పథకాన్ని నెలాఖరులోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నీళ్ల దగ్గర రాజకీయాలు చేస్తే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు.రైతులు ఎవరూ కూడా దిగులు పడొద్దని.. మీ భూముల్లో పైపలైన్ వేసిన మరలా పూడ్చి ఇస్తామని మంత్రి చెప్పారు. యధావిధిగా మళ్లీ వ్యవసాయం చేసుకోవచ్చని అన్నారు. పినపాకకి నీళ్లు ఇవ్వకుండా ఖమ్మంకి తీసుకెళ్లటం బాధగా ఉందన్నారు. ఎన్ని అడ్డంకులు వచ్చినా.. ఎవరు ఎటువంటి రాజకీయాలు చేసినా నెలాఖరుకు మారేళ్లపాడు ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేస్తామని మంత్రి తుమ్మల నాగే శ్వరరావు స్పష్టం చేశారు.

# రాజ్యాంగ హక్కులను కాపాడుకోవాలి

## మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి



**నాగర్ కర్నూల్ :** రాజ్యాంగ హక్కులను ( కాపాడుకుంటే రాజ్యాంగం మనల్ని కాపాడుతుందని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి అన్నారు. స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ నాగర్ కర్నూల్ కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు.దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను అర్పించిన మహానుభావులు ఆశలు, ఆశయాలకు అనుగుణంగా భారత దేశ అభివృద్ధి పదంలో భాగస్వాములు కావాలని పిలుపు నిచ్చారు. దేశంలో ప్రజలందరికీ సమాన హక్కులు, అవకాశాలు ఉండాలని అసమానతలు లేని సమాజం నిర్మాణం కావాలని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని అందించారని పేర్కొన్నారు.

పటిష్టమైన రాజ్యాంగం ఉన్నందువల్లనే భారతదేశం సమైక్యంగా, సమగ్రంగా భిన్నత్వంలో ఏకత్వంగా పురోగమిస్తు ందని తెలిపారు. ఈ కార్యక్రమం లో పార్టీ ప్రజా ప్రతినిధులు,పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# 26 మంది ఉద్యోగులకు హెల్త్ ఇన్సూరెన్స్ కార్డులు అందజేసిన కేటీఆర్



స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలంగాణ భవన్‌లో పనిచేస్తున్న 26 మంది ఉద్యోగులను శాలువాలతో సత్కరించి, రూ. 5 లక్షల చొప్పున హెల్త్ ఇన్సూరెన్స్ కార్డులను అందజేశారు.ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. మన కేంద్రకార్యాలయంలో 26 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. దీంతోపాటు జిల్లా ఆఫీసుల్లో పనిచేసేవాళ్లకు నెక్స్ట్ ఇద్దాం. మా తమ్ముడు తలసాని సాయి కిరణ్ ఆలోచన ఇది. మనం ఏం చేద్దాం అని నేను, చంద్రశేఖర్ రెడ్డి ఆలోచిస్తున్నప్పుడు తమ్ముడు సాయి కిరణ్ అక్కడే ఉన్నాడు. అన్నా ఉద్యోగులకు మంచి బట్టలు పెట్టి, ఇన్సూరెన్స్ ఇస్తే బాగుంటదనే ఒక మంచి కార్యక్రమం గురించి చెప్పాడు.

నాకు చెప్పడమే కాకుండా ఈ కార్యక్రమానికి మొత్తం సూత్రధారిగా వ్యవహా రం చేశాడు. ఇంత మంచి గొప్ప కార్యక్ర మాన్ని చేపట్టాలని చెప్పిన సాయి కిరణ్‌కు ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు మహమూద్ అలీ, సత్యవతి రాథో డ్, ఇతర సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# చాక్‌పీస్‌పై జాతీయ జెండా అక్షరాలు



**ఓదెల(కరీంనగర్):** కరీంనగర్ జిల్లా ఓదెల మండలంలోని మడక గ్రామానికి చెందిన చిత్రకళ ఉపాధ్యాయుడు ఆడెపు రజనీకాంత్ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని చాక్‌పీస్‌పై 2.6 సెంటీమీటర్ల ఎత్తు, ఒక సెంటీమీటర్ వెడల్పు ఉన్న జాతీయ జెం డాను సుమారు మూడు గంటల పాటు శ్రమించి తయారు చేశారు. ఆరు మిల్లీమీటర్ల ఎత్తు, నాలుగు మిల్లీమీటర్ల వెడల్పు ఉన్న హ్యాపీ ఇండిపెండెన్స్ డే ఆంగ్ల అక్షరాలను సుమారు గంటపాటు తయారు చేశారు. 1.5 సెంటీమీటర్ల ఎత్తు ఉన్న నాలుగు జాతీయ పతాకాలను, చాక్ పీస్ ముక్కలతో ఐ లవ్ ఇండియా అనే అక్షరాలను సుమారు గంట న్నర పాటు శ్రమించి గుండు పిన్ను సాయ ంతో తయారుచేసి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.రజనీకాంత్ గతంలో తన సూక్ష్మ కళతో ప్రపంచంలోనే అతి చిన్న జాతీయ పతాకాన్ని నాలుగు మిల్లీ మీటర్ల ఎత్తుతో చెక్కి క్రెడెన్స్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ లో చోటు సంపాదించాడు.

# తెలంగాణలో నిలిచిపోయిన రైతుబీమా

## నిన్నటితో ముగిసిన ప్రీమియం చెల్లింపు గడువు




**తెలంగాణ :** తెలంగాణలో రైతుబీమా పథకం అమలుపై అనిశ్చితి నెలకొంది. 2026--27 సంవత్సరానికి రైతుబీమా ప్రీమియం చెల్లించాల్సిన గడువు గురువారంతో ముగిసినా.. రాష్ట్ర ప్రభు త్వం ఇప్పటివరకు ప్రీమియం చెల్లించలేదు. దీంతో పథకం కొనసాగుతుందా లేదా అనే ఆందోళన రైతుల్లో వ్యక్తమవుతోంది.అకాల మరణం చెందిన రైతు కుటుంబాలను ఆదు కునేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం 201 8లో రైతుబీమా పథకాన్ని ప్రారంభించింది. ఎల్ఐసీతో కలిసి ఈ పథకాన్ని అమలు చేస్తూ వస్తోంది. పథకం కింద రైతు మరణిస్తే వారి కుటుంబానికి రూ.5 లక్షల బీమా పరిహారం అందుతుంది. ప్రతి ఏడాది ఆగస్టు 14న ప్రభుత్వం ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. ఇందుకోసం సుమారు రూ.1,400 కోట్ల వరకు వ్యయం అవుతోంది.ప్రస్తుతం రాష్ట్రంలో సుమారు 42 .16 లక్షల మంది రైతులు రైతు బీమా పథకం పరిధిలో ఉన్నారు. ఇప్పటి వరకు రైతుల కుటుంబాలకు ఆపత్కాలంలో ఈ పథకం అండగా నిలిచింది. అయితే 2026--27 సంవత్సరానికి ప్రీమి యం చెల్లి ంపు జరగకపోవడంతో పథకం భవి ష్యత్తుపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.రైతుబీమా ప్రీమియాన్ని ప్రభుత్వం వెంటనే చెల్లించి పథకాన్ని కొనసాగించాలని రైతులు కోరు తున్నారు. అనుకోని పరిస్థితుల్లో రైతు కుటు ంబానికి రూ.5 లక్షల ఆర్థిక భరోసా కల్పించే ఈ పథకం నిలిచిపోతే.. ఆ కుటు ంబాలు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉంద ని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం దీని పై స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు.

# స్వాతంత్ర్య దినోత్సవం నాడు అరెస్టుల పర్వం మంత్రి కోమటిరెడ్డి

## పర్యటనను అడ్డుకుంటారనే నెపంతో నిర్బంధం



**నల్లగొండ:** ప్రజాపాలనలో స్వాతంత్ర్య దినోత్సవం రోజున సైతం అరెస్టుల పర్వం కొనసాగుతోంది. నల్లగొండలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్ ఆర్డర్లు అందజేసే కార్యక్రమానికి హాజరుకానున్న నేపథ్యంలో.. ఆ పర్యటనను అడ్డుకుంటారనే నెపంతో సీపీఎం నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు పార్టీ కార్యాలయానికి వచ్చిన సమయంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, జిల్లా నాయకులు ఎండీ సలీం, ఔటరవీందర్‌లను పోలీసులు అరెస్టు చేశారు. ఈ సమయంలో పోలీసులు అడ్డుకునేందుకు పార్టీ నేతలు, కార్యకర్తలు అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో పోలీసులకు, సీపీఎం కార్యకర్తలకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. పరిస్థితి ఉద్రిక్తంగా మారినప్పటికీ పోలీసులు బలవంతంగా నాయకులను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపుల్లో అధికార పార్టీ నాయకులు అక్రమాలకు పాల్పడుతున్నారని, అర్హులను తొలగించి తమ అనుచరులకు ఇళ్లు కేటాయిస్తున్నారని సీపీఎం నాయకులు ఆరోపించారు. ఈ అంశాన్ని ప్రశ్నిస్తారనే భయంతోనే తమ నాయకులను ముందస్తుగా అరెస్టు చేశారని పేర్కొన్నారు.

సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, పట్టణ కార్యదర్శి దండంపల్లి సత్తయ్య అరెస్టులను తీవ్రంగా ఖండించారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజున పార్టీ నాయకులను అక్రమంగా నిర్బంధించడం దుర్మార్గమైన చర్య అని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన అందిస్తున్నామని చెబుతూ.. ప్రజా సమస్యలపై పోరాడుతున్న సీపీఎం నాయకులను అరెస్టు చేయడం సరికాదన్నారు. ప్రజా సమస్యలపై తమ పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. ప్రజా సమస్యలను పట్టించుకోని ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

# విద్యార్థులకు యూనిఫామ్‌లు ఇయ్యలే

## స్వాతంత్ర్య వేడుకల్లో నిరుత్సాహంగా



**ఆదిలాబాద్:** కాంగ్రెస్ సర్కార్ పాఠశాల విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని.. అన్నీ ఉచితంగా అందిస్తామని చెప్పి రెండు నెలలు గడుస్తున్నా విద్యార్థులకు ఏకరూప దుస్తులు అందించలేదు. ఆర్భాటంగా ప్రకటన చేసినప్పటికీ చివరకు అత్యంత ప్రత్యేకమైన స్వాతంత్ర దినోత్సవం రోజుకైనా అందుతాయనుకున్న దుసులు అందలేదు. ప్రభుత్వం రెండు రోజుల కిందట విద్యార్థులకు షూలు మాత్రమే అందించింది.దీంతో విద్యార్థులు చేసేదేమీ లేక తమ తమ పాత దుస్తులతో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొనాల్సి వచ్చింది. వేడుకలకు కొందరు పాత యూనిఫామ్‌తో వేడుకల్లో పాల్గొనగా.. మరికొందరు విద్యార్థులు మల్టీ కలర్ దుస్తులతో వచ్చారు. సాధారణంగా స్వాతంత్ర్య వేడుకల్లో విద్యార్థులు ఏకరూప దుస్తులతో, వివిధ వేశాధారణలో పాల్గొని ఉత్సహంతో కనబడుతారు. కానీ ప్రభుత్వం విద్యార్థులకు కేవలం షూలు మాత్రమే అందించి.. యూనిఫామ్‌లు మాత్రం అందించడంతో విద్యార్థులు కొత్త షూలు వేసుకొని పాత దుస్తులతో వేడుకల్లో పాల్గొన్నారు. విద్యార్థులు నిరుత్సాహంగా కనిపించడం ప్రభుత్వం నిర్లక్ష్యం ఎలా ఉందో చెప్పకనే చెబుతోంది. సమయానికి విద్యార్థులకు ఏకరూప దుస్తులు అందక పోవడం, మల్టీ దుస్తులతో ఉండటంతో వారి తల్లిదండ్రులు ప్రభుత్వ తీరుపై మండి పడుతున్నారు. ఏనాడూ ఇలా యూనిఫామ్ లు లేక స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొనలేదని విద్యార్థుల తల్లిదండ్రులు మండి పడుతున్నారు. రేవంత్ సర్కార్ హయాంలో విద్యాశాఖ పట్ల ఎలాంటి నిర్లక్ష్య వైఖరి అనుసరిస్తున్నారో తాజా ఘటన మరోసారి అద్దం పడుతోంది.

# ప్రజల అవసరాలే పరమావధిగా పాలన సాగిస్తున్నాం

## డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**ఖమ్మం:** తెలంగాణ ప్రజల అవసరాలే పరమావధిగా ప్రజా ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. కాంగ్రెస్ పాలనలో మహిళలు, విద్యార్థులు, రైతులు సహా అన్ని వర్గాలకూ సంక్షేమం అందుతోందని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా కలెక్టరేట్‌లో తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. డిప్యూటీ సీఎం భట్టి ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వం కొత్త రేషన్ కార్డుల జారీ విషయంలో కాలయాపన చేసిందని విమర్శించారఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. మహిళా సాధికారతకు కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో పాటు, స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రతి విద్యార్థికి అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తోందని తెలిపారు. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందని భట్టి చెప్పుకొచ్చారు. విద్యా రంగంలో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచి విద్యార్థులకు మంచి భవిష్యత్తును అందించేందుకు చర్యలు చేపడుతున్నామని ఆయన పేర్కొన్నారు.మరోవైపు, అన్నదాతల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. రైతు భరోసాతో పాటు అనేక సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని చెప్పారు. రైతులకు అండగా నిలుస్తూ వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వివరించారు.

## స్నేహితుడి నంబర్‌తో మెసేజ్ ఓపెన్ చేయగానే రూ.4.15 లక్షలు మాయం

**జగిత్యాల:** జిల్లాలో సైబర్ మోసం కలకలం రేపుతోంది. స్నేహితుడి నంబర్‌తో వచ్చిన ఓ మెసేజ్‌ను ఓపెన్ చేసిన వెంటనే దాదాపు నాలుగు లక్షల నగదు మాయమవడం సంచ లనం సృష్టిస్తోంది. అశోక్ అనే వ్యక్తి వాట్సా ప్‌నకుఈ–చలాన్ మెసేజ్ వచ్చింది. స్నేహి తుడి నంబర్ నుంచి రావడంతో ఆ లింక్‌ను ఓపెన్ చేశాడు అశోక్. ఆ వెంటనే అతడి బ్యాంక్ ఖాతా నుంచి నగదు బదిలీ అయ్యి ంది. రెండుసార్లు దాదాపు రూ.4.15 లక్షల ను కేటుగాళ్లు దోచేశారు. ఒకసారి రూ.3.99 లక్షలు, మరోసారి రూ.15వేల చొప్పున సైబర్ నేరగాళ్లు కాజేశారు.లింక్ ఓపెన్ చేసిన వెంటనే ఖాతా నుంచి డబ్బులు మాయమవ డంతో బాధితుడు షాక్‌కు గురయ్యాడు. వెంటనే సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయి ంచాడు.

# పంద్రాగస్టు ప్రసంగం: గత నాలుగేళ్లలో ప్రధాని మోదీ అతి తక్కువ నిడివి స్పీచ్ ఇదే!

**న్యూ ఢిల్లీ :** ప్రధాని నరేంద్ర మోదీ 80వ భారత స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శనివారం 75 నిమిషాలపాటు ప్రసంగించారు. ఇది గత నాలుగేళ్లలోనే ఆయన చేసిన అతి తక్కువ నిడివి కలిగిన ప్రసంగం కాగా, ఆయన కెరీర్?లోనే నాలుగో షార్టెస్ట్? స్పీచ్?గా నిలవడం గమనార్హం.గతేడాది భారత 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ 103 నిమిషాలపాటు ప్రసంగించారు. అంతకు ముందు అంటే 2024లో నిర్వహించిన 78వ ఇండిపెండెన్స్? డే సందర్భంగా ఆయన 98 నిమిషాల పాటు స్పీచ్ ఇచ్చారు. 2016లో 96 నిమిషాలపాటు ప్రసంగించారు. ఇక మోదీ 2017లో అత్యంత తక్కువ నిడివి గల ప్రసంగం (56 నిమిషాలు) చేశారు.నెహ్రూ రికార్డుకు చేరవలో మోదీశనివారం నాడు ఢిల్లీలోని ఎర్రకోట నుంచి మోదీ వరుసగా 13వసారి స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగాన్ని చేశారు. ఈ విధంగా, వరుసగా 17 స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగాలు చేసిన మాజీ ప్రధాని జవహర్?లాల్ నెహ్రూ తర్వాతి స్థానంలో మోదీ నిలిచారు. కాగా, గతేడాదే వరుసగా 12



ప్రసంగాలు చేసి, మాజీ ప్రధాని ఇందిరా గాంధీ చేసిన ప్రసంగాల రికార్డును మోదీ అధిగమించిన విషయం తెలిసిందే. వాస్తవానికి మోదీ తన మొదటి స్వాతంత్ర్య దినోత్స ప్రసంగాన్ని 2014లో చేశారు. ఆనాడు ఆయన కేవలం 65 నిమిషాలపాటు మాట్లాడారు. 2015లో 88 నిమిషాలు, 2018లో 83 నిమిషాలు, 2019లో 92 నిమిషాలపాటు ఆయన ప్రసంగించారు. ఇక 2020లో 90 నిమిషాలు, 2021లో 88 నిమిషాలు, 2022లో 74 నిమిషాలు, 2023లో 90 నిమిషాల పాటు ఆయన స్పీచ్? ఇచ్చారు.సుదీర్ఘ ప్రసంగాలు ఇవేమోదీ కంటే ముందు 1947లో జనహర్?లాల్? నెహ్రూ 72 నిమిషాలు, 1997లో ఐకే గుజ్రాల్ 71 నిమిషాల చొప్పున? అత్యంత సుదీర్ఘ ప్రసంగాలు చేశారు. అంతేకాదు రికార్డు స్థాయిలో అత్యంత తక్కువ నిడివి గల ప్రసంగాలను కూడా నెహ్రూ, ఇందిరా గాంధీ చేశారు. జవహర్?లాల్? నెహ్రూ 1954లో కేవలం 14 నిమిషాల మాత్రమే స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగం చేశారు. ఇందిరా గాంధీ 1966లో 14 నిమిషాల్లోనే తన ప్రసంగాన్ని ముగించేశారు. ఇక మాజీ ప్రధానులు డాక్టర్ మన్మోహన్? సింగ్?, అటల్ బిహారీ వాజ్?పేయీ కూడా ఎర్రకోట నుంచి అత్యంత తక్కువ నిడివిగల ప్రసంగాలు చేశారు.ఇక మాజీ ప్రధానులు డాక్టర్ మన్మోహన్? 2012, 2013లో మన్మోహన్ సింగ్ వరుసగా 32 నిమిషాలు, 35 నిమిషాల పాటు స్వాతంత్ర దినోత్సవ ప్రసంగాలు చేశారు. 2002, 2003 సంవత్సరాల్లో ఆనాటి ప్రధాని వాజ్?పేయీ వరుసగా 25 నిమిషాలు, 30 నిమిషాల వ్యవధిలోనే తన ప్రసంగాన్ని పూర్తి చేశారు.

## ‘ఒకవేళ అలా జరుగకపోయి ఉంటే జమ్ముకశ్మీర్‌లో పీవోకే కలిసేది



**శ్రీనగర్:** జమ్ముకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రత్యేక హోదాను రద్దు చేయకపోవడం, రాష్ట్ర హోదాను కేంద్రం తొలగించకపోయి ఉంటే పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే) ప్రజలు జమ్ముకశ్మీర్‌లో విలీనం కావడానికి తిరుగుబాటు చేసేవారని అన్నారు. (శనివారం శ్రీనగర్‌లో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమంలో ఒమర్ అబ్దుల్లా మాట్లాడారు. 1947లో పాకిస్థాన్ నుంచి దండెత్తి వచ్చిన గిరిజన దుండగులకు వ్యతిరేకంగా పోరాడి, భారతదేశంలో భాగం కావాలని ఎంచుకున్న కశ్మీర్ ప్రజల నిర్ణయాన్ని పీవోకేలోని ప్రస్తుత పరిస్థితులు సమర్థిస్తున్నాయని తెలిపారు. ప్రజాస్వామ్య హక్కులను కోరినందుకు పీవోకేలో డజన్ల కొద్దీ ప్రజలు మరణించారని, వందలాది గాయపడటం, జైలు పాలు కావడం తనను తీవ్రంగా బాధించిందని చెప్పారు.కాగా, 1947లో భారత సైన్యం కశ్మీర్‌కు రాకముందే, పాకిస్థాన్ దుండగులకు వ్యతిరేకంగా పోరాడి, తమ మాతృభూమిని కాపాడుకోవడానికి కశ్మీర్ ప్రజలకు నాయకత్వం వహించిన తన తాత, జమ్ముకశ్మీర్ మొదటి ప్రధానమంత్రి షేక్ మహమ్మద్ అబ్దుల్లాకు ఒమర్ అబ్దుల్లా నివాళులర్పించారు. ఇప్పుడు సరిహద్దు అవతల పరిస్థితిని చూసినప్పుడు, ‘దాడి చేసేవారికి జాగ్రత్త, మేం కశ్మీరీలం సిద్ధంగా ఉన్నాం’ అని మన పూర్వీకులు చెప్పింది నిజమేనని తనకు అర్థమవుతోందని తెలిపారు. ‘పీవోకేలోని పరిస్థితిని చూసి నాకు చాలా బాధగా ఉంది. 2019లో జమ్ముకశ్మీర్ రాష్ట్ర హోదా, ప్రత్యేక హోదాను రద్దు చేయకపోయి ఉంటే, ఈ రోజు పీవోకే ప్రజలు జమ్ముకశ్మీర్‌లో తమ పునరేకీకరణ కోసం తిరుగుబాటు చేసేవారని నేను ఖచ్చితంగా చెప్పగలను’ అని అన్నారు. ఎప్పటికైనా ఈ సీట్లు భర్తీ అవుతాయనే ఆశతో అసెంబ్లీలో అవతలి పక్షం కోసం ఆ సీట్లను ఖాళీగా ఉంచినట్లు స్పష్టం చేశారు.

## కాంగ్రెస్ కార్యాలయంలో వేడుకలు

**ఢిల్లీ:** ఢిల్లీలోని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయంలో 80వ స్వాతంత్ర దిన వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. అయితే, ఈ వేడుకల సందర్భంగా జరిగిన ఒక ఘటనపై స్వల్ప వివాదం మొదలైంది. వందేమాతరం గేయానికి ఇటీవల పూర్తిస్థాయి జాతీయ గేయంగా గౌరవం దక్కింది. జాతీయ గీతానికి ఉన్న గౌరవాన్నే కేంద్రం కల్పించింది. దీంతో తాజా స్వాతంత్ర్య దిన వేడుకల్లో వందేమాతరం ఆలపించడం తప్పనిసరి అయింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన వేడుకల



సందర్భంగా కూడా వందేమాతరాన్ని నిర్వాహకులు ప్లే చేశారు.అది కూడా పూర్తి గేయాన్ని. అయితే, ఈ గేయం ప్లే అవుతుండగా సోనియా, రాహుల్ వ్యవహరించిన తీరు వివాదాస్పదంగా మారింది. వందేమాతరం ప్లే అవుతున్నప్పుడు సోనియా, రాహుల్ కాస్త అటూ, ఇటూ చూడటం చేశారు. దీంతో పూర్తి వందేమాతరం గేయం ప్లే అవ్వకుండా ఆపేయాలంటూ సూచించారు అంటూ ప్రచారం జరుగుతోంది. ఈ సమయంలో పక్కనే కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా ఉన్నారు. సోనియా, ఖర్గే కాస్సేపు ఏదో చర్చించుకుంటున్నట్లు అక్కడి వీడియోలో కనిపించింది. దీంతో వారు వందేమాతరాన్ని ఆపేయమన్నారంటూ ప్రచారం జరగడంతో ఆ పార్టీ స్పందించింది. ఈ ప్రచారంలో ఎలాంటి నిజం లేదని కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. ఈ కార్యక్రమానికి హాజరైన ఖర్గే చాలాసేపు నిలబడే ఉన్నారు.

## ఎర్రకోటపై తొలిసారి ‘వందేమాతరం’ ఆలాపన

**న్యూ ఢిల్లీ :**దేశ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల చరిత్రలో మరో కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. ఆగస్టు 15న ఎర్రకోట ప్రాంగణంలో జరిగిన 80వ స్వా తంత్ర్య దినోత్సవ వేడుకల్లో తొలిసారిగా ‘వం దేమాతరం’ గేయం ఆలపించారు. అనంతరం జాతీయ గీతాన్ని ఆలపించారు. ‘వందేమాతరం’ గేయానికి 150 ఏళ్ల సుదీర్ఘ వారసత్వాన్ని పురస్కరించుకుని ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎర్రకోట గోడలను పూలతో అందంగా అలంకరించగా మధ్యలో జాతీయ జెండా, దానికి ఇరువైపులా హిందీలో ‘వందేమాతరం’ అని రాసిన అలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దేశభక్తి ఉత్సాహం, కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎర్రకోటపై 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు నాయకత్వం వహించారు.స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా అతిథులు, ప్రముఖులు హాజరైన సమయంలో ఆర్మీ బ్యాండ్ ‘వందేమాతరం’ బాణీని వాయించింది. ఆ తర్వాత ప్రధాని నరేంద్ర మోదీ జాతీయ



జెండాను ఆవిష్కరించారు. అనంతరం జాతీయ గీతాన్ని ఆలపించారు. త్రివర్ణ పతాకానికి ‘రాష్ట్రీయ సెల్యూట్’ సమర్పించారు. జెండా ఆవిష్కరణ అనంతరం భారత వైమానిక దళానికి చెందిన రెండు వీఈ-17 హెలికాప్టర్లు ఎర్రకోట వేదికపై పూల వర్షం కురిపించాయి. వీటిలో ఒక హెలికాప్టర్ జాతీయ జెండాను ప్రదర్శించగా, మరో హెలికాప్టర్ ‘వందేమాతరం’ అని రాసి ఉన్న జెండాతో కనిపించింది. ఆ దృశ్యాలు వేడుకలకు మరింత ప్రత్యేకతను తీసుకొచ్చాయి ఎర్రకోట నుంచి తొలిసారిగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ‘వందేమాతరం’ వినిపిం చడంపై ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. “ఈ రోజు ప్రతి హృదయం వందేమాతరం లయతో కొట్టుకుంటోం ది. ‘ఆజ్ ఘర్ త్రిరంగా హై, హర్ మన్ త్రిరంగా హై’. ఇది ఒక చారిత్రాత్మక రోజు. స్వాతంత్ర్యం తర్వాత ఎర్రకోట ప్రాంగణం నుంచి వందేమాతరం వినిపించడం ఇదే మొదటిసారి” అని అన్నారు. ఇది చారిత్రాత్మక ఘట్టమని పేర్కొన్నారు.150 ఏళ్ల చరిత్ర’వందేమాతరం’కు 150 ఏళ్ల చరిత్ర ఉంది. ప్రముఖ రచయిత “బంకిం చంద్ర ఛటర్జీ” 1875లో ఈ గీతాన్ని రచించారు. తొలుత దీనిని స్వతంత్ర గేయంగా రూపొందించారు. 1875 నవంబర్ 7న ‘బంగదర్శన్’ అనే సాహిత్య పత్రికలో ‘వందేమాతరం’ తొలిసారిగా ప్రచురితమైంది. ఆ తర్వాత 1882లో ప్రచురితమైన ‘ఆనందమఠం’ నవలలో దీనిని చేర్చారు.

# స్వేచ్ఛ అంటే బహుమతి మాత్రమే కాదు

**న్యూ ఢిల్లీ :** దేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవం సంద ర్భంగా లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. స్వేచ్ఛ అంటే స్వాతంత్ర్య సమరయో ధులు అందించిన కానుక మాత్రమే కాదని, దాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత కూడా ప్రజలపై ఉందని పేర్కొన్నారు. సత్యం, అహింస మార్గంలో నడవడం, రాజ్యాంగ విలువలను గౌరవించడం, త్రివర్ణ పతాకాన్ని గుండెల్లో నిలుపుకోవడం, ప్రజాస్వామ్యాన్ని ఎలాంటి పరిస్థితుల్లోనైనా పరిరక్షించడం ప్రతి పౌరుడి బాధ్యత అని రాహుల్ అన్నారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు.దేశ ప్రజలు, ముఖ్యంగా యువత ప్రజాస్వామ్య విలువలను కాపాడేం దుకు ఐక్యంగా నిలబడుతున్నారని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవడంతో పాటు, వారు అందించిన స్వేచ్ఛను భవిష్యత్ తరాలకు సురక్షితంగా అందించాల్సిన బాధ్యత ప్రస్తుత తరంపై ఉందని ఆయన సందేశం స్పష్టం



చేసింది.ఎర్రకోట నుంచి అన్నింటికీ మోదీ క్రెడిట్ : ఖర్గేజాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రధాని నరేంద్ర మోదీపై విమర్శలు గుప్పించారు. ఎర్రకోట నుంచి ప్రధాని మోదీ ప్రతి అంశానికీ తన తన ప్రభుత్వమే కారణమన్నట్లుగా క్రెడిట్ తీసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. దేశంలో ఇప్పటి వరకు జరిగి అభివృద్ధిలో కాంగ్రెస్ ప్రభుత్వాల పాత్రను విస్మరించలేమని అన్నారు. ఇక ఆహార హక్కు, విద్యా హక్కు, ఉపాధి హక్కు (ఎంఎన్ఆర్ ఈజీఏ) వంటి హక్కుల ఆధారిత చట్టాలను కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిందని చెప్పారు. ఈ విధానాల రూపకల్పనలో కాంగ్రెస్ పార్ల మెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. పేదలకు రాజ్యాంగబద్ధమైన హక్కులు అందించేందుకు అప్పటి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుందని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం అలాంటి ఒక్క హక్కును కూడా ప్రజలకు ఇవ్వలేదని విమర్శిం చారు. ఎవరు ఏ చట్టం ఎప్పుడు తీసుకొచ్చారో చరిత్రలో స్పష్టంగా నమోదై ఉందని, అందుకే క్రెడిట్ ఎవరిదో ప్రజలకు తెలుసని వ్యాఖ్యానించారు.స్వాతంత్ర్యం అంటే బ్రిటిష్ పాలన నుంచి విముక్తి మాత్రమే కాదు: ఖర్గేఅంతకుముందు ఎక్స్? వేదికగా దేశ ప్రజలకు ఖర్గే స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. భారత స్వాతంత్ర్యం కోసం తమ జీవితాలను త్యాగం చేసిన అసంఖ్యాక సమరయోధులకు ఘన నివాళులు అర్పించారు. వారి ధైర్యం, త్యాగం, దేశంపై ఉన్న అచంచల విశ్వాసం ఎప్పటికీ స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు. భారత్ ఎంతో దూరం ప్రయాణించినప్పటికీ, దేశం ముందున్న అనేక ఆకాంక్షలు ఇంకా నెరవేరాల్సి ఉందని ఖర్గే అన్నారు. స్వాతంత్ర్యం అంటే కేవలం బ్రిటిష్ పాలన నుంచి విముక్తి పొందడం మాత్రమే కాదని వ్యాఖ్యానించారు. దేశ రాజ్యాంగం ప్రతి భారతీయుడికి కల్పించిన సమానత్వం, గౌరవం, న్యాయం, భయంలేకుండా మాట్లాడే స్వేచ్ఛ నిజమైన స్వాతంత్ర్యానికి ప్రతీకలని పేర్కొన్నారు. ఇవే ప్రజాస్వామ్యానికి బలమైన పునాదులని, పౌరుల హక్కులకు రక్షణ కవచాలని తెలిపారు.

## నలుగురు మృతి.. ఐదుగురు జవాన్లు గల్లంతు

**అరుణాచల్‌ప్రదేశ్ :**రాష్ట్రంలో శుక్రవారం సాయంత్రం భారీ వర్షాలు కురిశాయి. దీనివల్ల సంభవించిన వరదల కారణంగా కొండచరియలు విరిగిపడ్డాయి. వేర్వేరుగా జరిగిన ఈ ఘటనల్లో నలుగురు చనిపోగా, ఐదుగురు సైనికులు గల్లంతయ్యారు. ఆ రాష్ట్రంలోని అప్పర్‌సుబన్‌సిరి జిల్లాలోని కియోజరింగ్–బయాచింగ్ రోడ్డు మలుపు ప్రాంతం, దిబంగ్ లోయ జిల్లాలో ఈ ఘటనలు జరిగాయి.దిబంగ్ లోయలో..ఈ లోయ (భారీ వర్షాల కారణంగా వరదలు సంభవించాయి. ఈ జిల్లాలోని పసుపానీ ఆర్మీ క్యాంపులోని రెండు షెల్టర్లు కొట్టుకుపోయాయి. ఐదో



గ్రెనేడియర్‌కు చెందిన ఏడుగురు జవాన్లు కొట్టుకుపోయారు. ఇద్దరిని రక్షించగా, ఐదుగురు గల్లంతయ్యారు. గల్లంతైనవారిని హవల్దార్ ఉపేందర్, ఆర్మీ సిబ్బంది కుందన్, వినోద్, ఆదిత్య, సముంద గా గుర్తించారు. ఐదో గ్రెనేడియర్, ఇండో–టిబెటన్ బోర్డర్ పోలీస్ () 58వ బెటాలియన్, జనరల్ రిజర్వ్ ఇంజినీర్ ఫోర్స్‌కు చెందిన , అరుణాచల్‌ప్రదేశ్ పోలీసులు, వలంటీర్లు సహాయక చర్యలు చేపట్టారు.అప్పర్‌సుబన్‌సిరిలో..అప్పర్‌సుబన్‌సిరి ప్రాంతంలో విరిగిపడిన కొండచరియల (ఋఅంంశ్రీఅంవ) శిథిలాల కింద పలువురు కూరుకుపోయారు. టాడు బాకి, తాజి రాయ్, మర్కోష్ బసుమతారి, బాబుల్ అలీ మృతదేహాలను వెలికితీసినట్లు అధికారులు వెల్లడించారు. నాచో పోలీస్ స్టేషన్ సిబ్బంది సహాయక చర్యలు చేపడుతున్నారు. దపోరిజోకు చెందిన అగ్నిమాపక, ఎమర్జెన్సీ బృందాలు, బృందం సహాయక చర్యల్లో పాల్గొన్నాయి.రాష్ట్ర విపత్తు నిర్వహణ శాఖ (ాణవీణ) విడుదల చేసిన నివేదిక ప్రకారం ఆగస్టు నెల ప్రారంభంలో వరదలు, కొండచరియలు విరిగిపడటం వల్ల రాష్ట్ర వ్యాప్తంగా 10 మందికి పైగా మరణించారు. అంతేకాకుండా 235 రోడ్లు, 40 వంతెనలు, 75 కల్వర్టులు, 373 వాటర్ సప్లయ్ సిస్టమ్స్, 161 విద్యుత్ లైన్లు, 823 విద్యుత్ స్తంభాలు, 66 సాగునీటి ప్రాజెక్టులు, 122 ప్రభుత్వ భవనాలు, 41 స్కూళ్లు, 12 జలవిద్యుత్ ప్రాజెక్టులు ధ్వంసమయ్యాయని నివేదిక వెల్లడించింది.

## తెరుచుకోనున్న శబరిమల అయ్యప్ప ఆలయం

**కేరళ :** కేరళ లోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శబరిమల అయ్యప్ప ఆలయం ఆదివారం తెరుచుకోనుంది. చింగం మాస పూజల నిమిత్తం ఆలయాన్ని తెరుస్తున్నామని అధికారులు చెప్పారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కలిపించేందుకు ట్రావెన్ కోర్ దేవస్థానం బోర్డ్ (), కేఎస్ఆర్‌టీసీ తగిన ఏర్పాట్లు చేస్తున్నాయని అధికారులు తెలిపారు.ఆలయ పూజారి కందరారు బ్రహ్మదత్తన్ సమక్షంలో ఆలయ



ప్రధాన పూజారి ప్రసాద్ ఈడీ ఆదివారం సాయంత్రం ఐదు గంటలకు ఆలయాన్ని తెరుస్తారని టీడీబీ ఓ ప్రకటనలో తెలిపింది. మలయాళ నూతన సంవత్సర ఆరంభాన్ని పురస్కరించుకొని ఈనెల 17న ఉదయం 5 గంటల నుంచి భక్తులకు దర్శనం కల్పిస్తారు. చింగం మాస పూజలు ముగిశాక ఆగస్టు 21న రాత్రి 10 గంటలకు ఆలయాన్ని మూసివేసి, తిరిగి ఓనం పండుగ పూజల కోసం ఈనెల 24న తెరుస్తారు.

## మహిళా రిజర్వేషన్లపై మోదీది ద్వంద్వవైఖరి- ఆయన మాటల్లో నిజాయితీ లేదు

**న్యూ ఢిల్లీ :**స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో మహిళా రిజర్వేషన్ల గురించి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర విమర్శలు గుప్పించింది. మోదీ మాటల్లో కపటత్వం ఉందంటూ కాంగ్రెస్ సీనియర్? నేత జైరాం రమేశ్? ఆరోపించారు. ఎక్స్ వేదికగా ఆయన మోదీపై తీవ్రంగా విరుచుకుపడ్డారు. ‘నారీ శక్తి వందన్ అధినియమ్’ (మహిళా రిజర్వేషన్ల బిల్లు) 2023 సెప్టెంబర్?లోనే పార్లమెంట్‌లో ఏకగ్రీవంగా ఆమోదం పొందినప్పటికీ, బీజేపీ ప్రభుత్వ ద్వంద్వ విధానాల వల్ల అది 2024 ఎన్నికల నుంచే అమలులోకి రాకుండా పోయిందని ఆరోపించారు. ఈ చట్టానికి సంబంధించిన నోటిఫికేషన్‌ను 2026 ఏప్రిల్ 16న రాత్రి వేళ అత్యంత హడావుడిగా విడుదల చేశారని



వ్యాఖ్యానించారు. అయితే, ప్రస్తుతం లోక్‌సభలో ఉన్న 543 స్థానాల పరిధిలోనే, 2029 లోక్‌సభ ఎన్నికల నుంచి మహిళా రిజర్వేషన్లను అమలు చేయాలనేది కాంగ్రెస్ నిర్ణయమని ఆయన స్పష్టం చేశారు. తమ పార్టీ వైఖరిలో ఎటువంటి మార్పులేదని తేల్చి చెప్పారు.”స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోట నుంచి ప్రధాని చేసిన ప్రసంగంలో మహిళా రిజర్వేషన్ల విషయంలో అసత్యమైన వాదన ఉంది. 2023 సెప్టెంబర్?లో పార్లమెంటు ‘నారీ శక్తి వందన్ అధినియం’ను ఏకగ్రీవంగా ఆమోదించిందన్న విషయం ఆయనకు తెలిసి ఉండాలి. కానీ మోదీ ప్రభుత్వ ద్వంద్వ ప్రమాణాలు, కపట వైఖరి కారణంగా, 2024 ఎన్నికల వరకు దీనిని అమలు చేయలేకపోయారు. 1993లో ఆమోదించిన 73, 74వ రాజ్యాంగ సవరణల ద్వారా మహిళా రిజర్వేషన్ల అంశం రాజ్యాంగంలో చేర్చారు. దీనిని సాకారం చేయడంలో రాజీవ్ గాంధీ దూరదృష్టి, దృఢ సంకల్పం ఉన్నాయని ప్రధానమంత్రి గుర్తుంచుకోవాలి.”

# విజయవాడలో రేపు డీఎస్సీ
## 2025 ఉపాధ్యాయుల ర్యాలీ

**అమరావతి:** కష్టపడి చదివి డీఎస్సీ పరీక్షలు రాస్తే.. తమను అవమానిస్తున్నారంటూ వైసీపీ నేతలపై ఉపాధ్యాయులు మండిపడ్డారు. తమను అవమానిస్తే ఊరుకునేది లేదని ఆ పార్టీ నేతలను వారు హెచ్చరించారు. శనివారం విజయవాడలో డీఎస్సీ-2025 పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన ఉపాధ్యాయులు మాట్లాడారు. వైసీపీ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తామంతా తిప్పి కొట్టాలని నిర్ణయించినట్లు వారు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ఆదివారం విజయవాడలో ఆత్మ గౌరవ ర్యాలీ నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఉదయం 10.30 గంటలకు ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నుంచి డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ చేపట్టనున్నట్లు వివరించారు. అనంతరం డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పిస్తామన్నారు.




ఆ తర్వాత ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియం వరకు ర్యాలీ చేయనున్నట్లు వివరించారు. ఈ ర్యాలీలో ఉమ్మడి ప్రకాశం, గుంటూరు, కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొంటారని తెలిపారు. ఈ ర్యాలీలో సుమారు 7 వేల మంది ఉపాధ్యాయులు పాల్గొనున్నారని సమాచారం. గత వారం డీఎస్సీ-2025లో విజేతలుగా నిలిచిన ఉపాధ్యాయులు కర్నూలులోని కొండారెడ్డి బురుజు వద్ద భారీ ర్యాలీ నిర్వహించిన సంగతి తెలిసిందే. రాయలసీమ జిల్లాల్లో డీఎస్సీ 2025లో విజేతలుగా నిలిచిన ఉపాధ్యాయులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు.

2025లో కూటమి ప్రభుత్వం డీఎస్సీ నిర్వహించింది. అయితే ఈ పరీక్షల్లో భారీగా అక్రమాలు, అవినీతి చోటు చేసుకున్నాయంటూ వైసీపీ నేతలు ప్రచారానికి తెగబడ్డారు. దీనిపై ఇప్పటికే ప్రభుత్వం స్పందించింది. అయినా వైసీపీ నేతలు మాత్రం ఆరోపణలను ఆపడం లేదు. దీంతో వైసీపీ నేతల విమర్శలను ఈ డీఎస్సీలో ఉత్తీర్ణులైన వారే తిప్పికొ డుతున్నారు. అందుకోసం వారు స్వయంగా రంగంలోకి దిగి.. వైసీపీ నేతలకు క్లారిటీ ఇస్తున్నారు. అందులో భాగంగా ఆదివారం విజయవాడలో వీరంతా ర్యాలీ చేయనున్నారు

## కులమత ప్రాంతాలకు అతీతంగా
### జాతీయ పండుగ పీవీఎన్ మాధవ్

**విజయవాడ:** కులమత, ప్రాంతాలకు అతీతంగా జాతీయ పండుగ జరుపుకుంటున్నామని బీజేపీ ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో 80వ స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో పీవీఎన్ మాధవ్ పాల్గొని ప్రసంగించారు. స్వాతంత్రం వచ్చినా వందేమాతర గీతం ఆలపించడం ఆగిపోయిందని.. ఇవాళ ప్రధాని మోదీ వందేమాతర గీతం పూర్తిగా ఆలపించారని తెలిపారు. కొందరు సంకుచిత మతతత్వ ఆలోచనతో ఏ మాతకీ వందనం చెప్పకుండా భీష్మించుకుని కూర్చున్నారని మండిపడ్డారు. అధికారికంగా దేశం మొత్తం వందేమాతర గీతం పూర్తిగా ఆలపించారని మాధవ్ తెలిపారు. సర్దార్ వల్లభాయ్



పటేల్ ఏక్ భారత్ నినాదం తీసుకొచ్చారని అన్నారు. ప్రధాని మోదీ ప్రభుత్వంలో టెర్రరిస్టు, మావోయిస్టు కార్యకలాపాలు లేకుండా చేశారని పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు.

## స్వాతంత్ర్య వేడుకల్లో మంత్రి ఆనంకు అస్వస్థత

**తిరుపతి:** స్వాతంత్ర్య వేడుకల్లో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అస్వస్థత గురయ్యారు. ఇవాళ(బుధవారం) తిరుపతి పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించిన స్వాతంత్ర్య వేడుకలకు మంత్రి రామనారాయణరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం ప్రసంగిస్తున్న సమయంలో స్పృహతప్పి ఒక్కసారిగా పక్కకు వాలిపోయారు. వెంటనే అప్రమత్తమైన భద్రతా సిబ్బంది మంత్రి కింద పడకుండా పట్టుకున్నారు. బీపీ డౌన్ అయినట్లు గుర్తించిన వైద్యులు.. సకాలంలో మంత్రికి ప్రాథమిక చికిత్స అందించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు వెల్ల




డించారు. కాసేపటి తర్వాత మంత్రి ఆనం స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొన్నారు. మంత్రి ప్రసంగాన్ని తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు కంటిన్యూ చేశారు.

# ఏపీ వ్యాప్తంగా ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు
## ఊరూవాడా జాతీయ జెండా రెపరెపలు

**అమరావతి:** ఏపీ వ్యాప్తంగా స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఊరూవాడా అంతటా జాతీయ జెండా రెపరెపలాడింది. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయా నియోజకవర్గాల్లో ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్యేలు త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఆపై ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. ఈఏడాది తొలిసారిగా రాష్ట్ర రాజధాని అమరావతిలో జాతీయ జెండా వేడుకలను నిర్వహించారు. రాయపూడిలోని పరేడ్ గ్రౌండ్‌లో సీఎం చంద్రబాబు జాతీయ జెండాను ఎగురవేశారు. ఏపీ అసెంబ్లీలో 80వ స్వాతంత్ర్య వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణం రాజు, ఎమ్మెల్యే యార్లగడ్డ, అసెంబ్లీ సెక్రటరీ జనరల్ తదితరులు పాల్గొన్నారు. జాతీయోద్యమ నాయకులు, రాష్ట్రానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధులకు స్పీకర్ ఘన నివాళులర్పించారు. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వీరోచిత పోరాటాన్ని ప్రత్యేకంగా గుర్తుచేశారు. ఏపీ శాసనసభ ఐదు కోట్ల ప్రజల ఆశలు, ఆకాంక్షలకు ప్రతిరూపమని స్పీకర్ అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు.



**చిత్తూరు** జిల్లాలోని పోలీస్ పరేడ్ మైదానంలో 80వ స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంత్రి సత్యకుమార్ ముఖ్యఅతిథిగా హాజరై వేడుకలను ప్రారంభించారు. జాతీయ త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి పోలీస్ గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ వేడుకల్లో పార్లమెంట్ సభ్యులు దగ్గు మల్ల ప్రసాదరావు, ఎమ్మెల్యేలు చిత్తూరు గురుజాల జగన్మోహన్, పూతలపట్టు మురళీమోహన్, చూడ చైర్మన్ కటారి హేమలత, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్పీ తుషార్ డుడి, జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ పాల్గొన్నారు.

**కడప:** జిల్లాలోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్లో 80వ స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు.

**కృష్ణాజిల్లా:** మచిలీపట్నంలో జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో మంత్రి కొల్లు రవీంద్ర పాల్గొన్నారు. జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన మంత్రి.. సాయుధ దళాల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. జిల్లా కలెక్టర్ ఎం నవీన్, ఎస్పీ విద్యాసాగర్ నాయుడితో కలిసి ప్రత్యేక వాహనం ద్వారా పరేడ్‌ను కొల్లు రవీంద్ర పరిశీలించారు. అనంతరం వేదికపై నుంచి జిల్లా ప్రగతిని వివరించారు.

**అనకాపల్లి** జిల్లాలో స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ స్టేడియం మైదానంలో రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఎందరో మహనీయుల త్యాగాల ఫలితంగానే స్వాతంత్ర్యం వచ్చిందని అనిత అన్నారు. అనకాపల్లి కేవలం జిల్లా కాదు.. పోరాటాల గడ్డగా అభివర్ణించారు. అల్లూరి సీతారామ రాజు పోరాట స్ఫూర్తి.. గురజాడ అప్పారావు సామాజిక చైతన్యం అనకాపల్లి గడ్డ ప్రత్యేకత అని అనిత పేర్కొన్నారు.

**నంద్యాల** జిల్లాలోని పి.ఎస్.సి డ కె.వి.ఎస్.సి ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ మైదానంలో 80వ స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా జరిగాయి. రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ ఎండి ఫరూక్ ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు.

**కర్నూలు:** స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని పోలీసు పరేడ్ మైదానంలో రాష్ట్ర పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్, వాణిజ్య శాఖ మంత్రివర్యులు టి.జి.భరత్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జిల్లా కలెక్టర్, ఎస్పీలతో కలిసి పరేడ్‌ను వీక్షించి, సాయుధ దళాల నుంచి గౌరవ వంద నం స్వీకరించారు.

ఈవేడుకలకుజిల్లాకలెక్టర్ ఇతర ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు, తది తరులు హాజరయ్యారు.

## దక్షిణ కోస్తా రైల్వే జోన్‌లో రూ4894 కోట్ల
### ఆదాయం జీఎం సందీప్ మాథుర్

**విశాఖపట్నం:** దక్షిణ కోస్తా రైల్వే జోన్ పరిధిలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.4,894 కోట్ల ఆదాయం వచ్చిందని జీఎం సందీప్ మాథుర్ వెల్లడించారు. 32 వేల మిలియన్ టన్నుల సరుకు రవాణా చేసి రూ.3,300 కోట్ల ఆదాయం పొందిందని వివరించారు. శనివారం 80వ స్వాతంత్ర్య వేడుకలు సందర్భంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ప్రధాన కార్యాలయంలో ఆయన త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా జోన్ పరిధిలోని రైల్వే సిబ్బంది, అధికారులతోపాటు ప్రజలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జీఎం సందీప్ మాథుర్ మాట్లాడుతూ.. భారతీయ రైల్వేలో18వ జోనల్ హెడ్ క్వార్టర్‌గా 2026 జూన్ 1వ తేదీన ప్రారంభమైందని గుర్తు చేశారు. దీంతో ఈ రైల్వే జోన్ ఆధ్వర్యంలో తొలిసారిగా ఈ స్వాతంత్ర వేడుకలు జరుగుతున్నాయని గుర్తు చేశారు.

జోన్ పరిధిలోని 1070 లోకోమోటివ్‌లలో ఇప్పటికే ప్రమాదాల నివారణకు 719 లోకోమోటివ్‌లకు కవచ్ ఏర్పాటు చేశామని అన్నారు. దక్షిణ కోస్తా రైల్వే జోన్ పరిధిలో మౌలిక సదుపాయాలు కల్పనకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. అందులోభాగంగా డబ్లింగ్, ట్రిప్లింగ్



ప్రాజెక్టులను రూ.1.25 లక్షల కోట్లు ఖర్చు చేయనున్నట్లు పేర్కొన్నారు. అందులో రూ. 54,479 కోట్లు ఇప్పటికే వెచ్చించి పనులు చేపట్టామని ఆయన వివరించారు. విశాఖపట్నం యార్డ్ మోడలింగ్ ప్రాజెక్టుకు రూ. 299 కోట్లు ఆమోదం లభించిందన్నారు. దీంతో 6 అదనపు లైన్లు, 6 అదనపు ప్లాట్ ఫారాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. గుంతకల్- బళ్లారి డివిజన్‌లో నాలుగు లైన్లు నిర్మాణం కోసం రూ.1,205 కోట్లు నిధులు మంజూరు చేసినట్లు జీఎం సం దీప్ మాథుర్ వెల్లడించారు.

## తెలుగు ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు
### మంత్రి నారా లోకేశ్

**అమరావతి:** 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా తెలుగు ప్రజలందరికీ మంత్రి నారా లోకేశ్ శుభాకాంక్షలు తెలిపారు. దేశానికి స్వాతంత్ర్యం సాధించడం వెనుక ఎందరో మహనీయుల త్యాగాలు, పోరాటాలు, నిరంతర కృషి దాగి ఉన్నాయి. దేశ స్వేచ్ఛ కోసం తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను ఈ పవిత్రమైన రోజున ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలన్నారు. వారి త్యాగాల ఫలితంగానే మనం స్వేచ్ఛా వాయువులు పీలుస్తూ, ప్రజాస్వామ్య విలువలను అనుభవిస్తూ ముందుకు సాగుతున్నాం అని అన్నా రు.స్వాతంత్ర్యం అనేది కేవలం బ్రిటీష్ పాలన నుంచి విముక్తి పొందిన రోజును గుర్తుచేసుకోవడం మాత్రమే కాదు.. దేశం కోసం మన బాధ్యతలను గుర్తించుకునే సందర్భం అన్నారు. దేశా




న్ని మరింత బలమైన, అభివృద్ధి చెందిన, సమగ్ర, సుసంపన్నమైన దేశంగా తీర్చిదిద్దడంలో ప్రతి పౌరుడు తన వంతు పాత్ర పోషించడమే.. సమరయోధుల త్యాగాలకు నిజమైన నివాళి అని చెప్పారు. యువతలో దేశభక్తి, బాధ్యత, సేవాభావం, క్రమశిక్షణ వంటి విలువలను పెంపొందిస్తూ భవిష్యత్ తరాలకు మెరుగైన భారతదేశాన్ని అందించేందుకు మనమంతా కృషి చేయాలి లోకేశ్ అన్నారు.

## వాడవాడలా మువ్వన్నెల రెపరెపలు

**తిరుపతి:** 80వ స్వాతంత్ర్య దిన వేడుకలు శనివారం జిల్లావ్యాప్తంగా ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. వాడవాడలా త్రివర్ణ పతాకం రెపరెపలాడింది. తిరుపతిలోని పోలీస్ పరేడ్ మైదానంలో జరిగిన వేడుకల్లో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు... పోలీసు దళాల కవాతు... వివిధశాఖల ప్రగతిని ప్రతిబింబిస్తూ సాగిన శకటాలు.. పోలీసు జాగిలాల విన్యాసాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. వివిధ శాఖలు, రంగాల్లో ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు, అధికారులకు, ఇతరులకు మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, కలెక్టర్ వెంకటేశ్వర్ ప్రశంసా పత్రాలు అందజేశారు. రైల్వేకోడూరుకు చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు రాఘవరాజు రామలింగరాజు కుమారుడు రాధాకృష్ణమరాజును ఘనంగా సన్మానించారు. ఎస్పీ సుబ్బరాయుడుతో కలిసి వివిధ శాఖల తరపున ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించి ఎస్‌హెచ్‌జీ మహిళలకు రుణాలందజేశారు.

కైవసం ద్వారా జాగిలాల విన్యాసాలు ఆకట్టుకున్నాయి

# ఏపీకి 7 శౌర్య పతకాలు

**న్యూఢిల్లీ:** స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని కేంద్ర హోం శాఖ శుక్రవారం ప్రకటించిన శౌర్య, సేవా పతకాల్లో మన రాష్ట్రానికి 27 లభించాయి. దేశవ్యాప్తంగా పోలీసు, అగ్నిమాపక దళం, హోంగార్డు, పౌర రక్షణ, జైళ్ల శాఖలకు చెందిన 1,057 మంది సిబ్బందికి కేంద్రం శౌర్య, సేవా పతకాలను ప్రకటించింది. వీరిలో 301 మందికి శౌర్య పతకాలు, 92 మందికి రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలు, 664 మందికి విశిష్ట సేవా పతకాలు దక్కాయి. వీటిలో ఏపీకి 7 శౌర్య పతకాలు, 2 రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలు, 14 విశిష్ట సేవా పతకాలు లభించాయి. ఇక తెలంగాణకు చెందిన 18 మంది శౌర్య, సేవా పతకాలు దక్కించుకున్నారు. వీటిలో 3 శౌర్య, 2 రాష్ట్రపతి విశిష్ట సేవా, 10 విశిష్ట సేవా పతకాలు ఉన్నాయి. అగ్నిమాపక విభాగంలో తెలుగు రాష్ట్రాలకు రెండు చొప్పున విశిష్ట సేవా పతకాలు, జైళ్ల శాఖ విభాగంలో ఏపీకి 2 విశిష్ట సేవా పతకాలు లభించాయి. కాగా, సశస్త్ర సీమా బల్ ఐజీగా పని చేస్తున్న ఏపీకి చెందిన మాలోతు రాములునాయక్, అలాగే సీఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ అయిన తెలుగు అధికారి డి.జయచంద్రనాయుడికి రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలు దక్కాయి. దక్షిణ మధ్య రైల్వే సబ్‌ఇన్‌స్పెక్టర్ గురుప్రసాద్ నగరికంటికి కూడా విశిష్ట సేవా పతకం లభించింది.

పతకాలు దక్కించుకున్న ఏపీ సిబ్బంది

ఆంధ్రప్రదేశ్ పోలీస్ సర్వీస్ విభాగం నుంచి ఏఆర్ హెడ్ కానిస్టేబుళ్లు కె.మల్లేశ్, పైడి శ్రీరామమూర్తి, ఏఆర్ కానిస్టేబుళ్లు




హేమసుందరరావు, చింతపల్లి సత్యనారాయణ, రౌతు మహేశ్, ఆబోతుల అప్పలనాయుడు, రూతాల కన్నబాబుకు శౌర్య పతకాలు లభించాయి. ఐజీ అధికారులు విజయకుమార్ గూడి, బి. వెంకట రామిరెడ్డికి రాష్ట్రపతి విశిష్ఠ సేవా పతకాలు దక్కాయి. పోలీస్ సర్వీస్ విభాగంలో గీతాదేవి(ఎస్పీ), సుబ్బారావు తుమ్మల(డీఎస్పీ), జగ్గునాయుడు పెంట(డీఎస్పీ), ఐ.రామకృష్ణ(ఏఎస్పీ), సదేపల్లి చంద్రమోహన్(డీఎస్పీ), కాన్‌జాక్సన్ పసుపు లేటి(డీఎస్పీ), మహబూబ్ బాషా సయిద్(అసిస్టెంట్ కమాండెంట్), శ్రీనివాసరాజు మంతెన(హెడ్ కానిస్టేబుల్), ఎం. రామప్రసాద్(ఆర్మ్డ్ పోలీస్ ఎస్ఐ), మోహన్‌రావు(ఏఎస్ఐ), శేషాపాణి పగడాల(ఆర్మ్డ్ పోలీస్ ఎస్ఐ), రాజారావు రోలుపల్లి(హెడ్ కానిస్టేబుల్), బసవయ్య పొదిలి(ఆర్మ్డ్ ఎస్ఐ), ఎన్.చెంచురా మయ్య (ఏఎ?సఐ)కు విశిష్ఠ సేవా పతకాలు లభించాయి. అగ్నిమాపక విభాగంలో సత్యనారాయణ కాపు(డిస్ట్రిక్ట్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ ఫైర్ ఆఫీసర్), జాశారయ్య పెను మాక (ఫైర్‌మెన్)కు, జైళ్ల శాఖ విభాగంలో రాహుల్ శ్రీరామ(సూపరిండెంటెంట్ ఆఫ్ జైల్స్), విశిష్ఠ సేవా పతకాలు లభించాయి.

## స్వాతంత్ర్య స్ఫూర్తితో శ్రీవారి భక్తులకు మరింత
### ఉన్నతంగా సేవలు అందిస్తాం టీటీడీ అదనపు ఈవో



**తిరుమల:** స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తితో శ్రీవారి భక్తులకు మరింత ఉన్నతంగా సేవలు అందిస్తామని టీటీడీ అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరి తెలిపారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శనివారం తిరుమలలోని గోకులం విశ్రాంతి భవనం క్యాంపు కార్యాలయంలో జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం ఆయన ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడుతూ టీటీడీలో భక్తుల సౌకర్యాలు, పర్యావరణ పరిరక్షణ, సాంకేతికత, పారదర్శకత, సమర్థవంతమైన పరిపాలనకు అనేక సంస్కరణలు చేపట్టామని వెల్లడించారు. తిరుమలలో పెరుగుతున్న వాహన కాలుష్యాన్ని నియంత్రించేందుకు ఎలక్ట్రిక్ బస్సులను పెద్దఎత్తున ప్రవేశపెట్టే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రస్తుతం తిరుమలకు 10 వేల నుంచి 14 వేల వరకు వాహనాలు వస్తున్న నేపథ్యంలో కాలుష్య నియంత్రణ అత్యంత అవసరమన్నారు. దాతల సహకారంతో మరో 37 ఎలక్ట్రిక్ బస్సులకు భక్తులకు అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు.

రానున్న బ్రహ్మోత్సవాలకు సుమా రు 25 ఎలక్ట్రిక్ బస్సులు అందుబాటులోకి రానున్నాయని చెప్పారు. ఎన్ఆర్ఐ సంస్థ సహ కారంతో ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ కమా ండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ) రెండో దశ కూడా విజయవంతంగా అభివృద్ధి చెందిందని అదనపు ఈవో తెలిపారు. భక్తులు ఎక్కడ ఉన్నారు, ఎంతమంది ఉన్నారు, ఎంతసేపు వేచి ఉన్నారు, ప్రతి గంటకు ఎంతమంది చేరుతున్నారు, ఎంతమందికి దర్శనం కల్పిస్తున్నారనే సమాచారాన్ని రియల్‌టైమ్‌లో తెలుసుకునే అవకాశం ఏర్పడిందన్నారు. టీటీడీ అన్నప్రసాదాల కోసం నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. తిరుపతిలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, కోల్డ్ స్టోరేజ్ తదితర సదుపాయాలతో స్టేట్ ఆఫ్ ది ఆర్ట్ వేర్‌హౌస్ ఏర్పాటు చేయడానికి ప్రణాళిక సిద్ధమైందని వెల్లడించారు.

# ఘనంగా మొదలెట్టిన టీమిండియా

### దేవదత్ పడిక్కల్ అజేయ శతకం

### రాహుల్, పడిక్కల్ ఆధిపత్యం..

### తొలి రోజు 2 వికెట్లకు 288 పరుగులు



శ్రీలంకతో రెండు టెస్ట్‌ల సిరీస్‌ను టీమిండియా ఘనంగా మొదలెట్టింది. గాలే వేదికగా శనివారం ప్రారంభమైన మ్యాచ్‌లో అద్వితీయమైన బ్యాటింగ్ ప్రదర్శనతో ఆధిపత్యం చెలాయించింది. దేవదత్ పడిక్కల్(178 బంతుల్లో 12 ఫోర్లు, సిక్స్‌తో 131 బ్యాటింగ్) అజేయ శతకంతో తొలి రోజు ఆట ముగిసే సమయానికి భారత్ 73 ఓవర్లలో 2 వికెట్లకు 288 పరుగుల భారీ స్కోర్ చేసింది. దేవదత్ పడిక్కల్‌తో పాటు రిషభ్ పంత్(36 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 27 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. కేఎల్ రాహుల్( 162 బంతుల్లో 9 ఫోర్లు, సిక్స్‌తో 77 రిటైర్డ్ హర్ట్) హాఫ్ సెంచరీతో ఆకట్టుకున్నాడు. శ్రీలంక బౌలర్లలో ప్రబాత్ జయసూర్య ఒక వికెట్ తీసాడు. వర్షం అంతరాయం కారణంగా తొలి రోజు 77 ఓవర్ల ఆటనే సాధ్యమైంది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన టీమిండియాకు శుభారంభం దక్కలేదు. సాధికారికంగా బ్యాటింగ్ చేసిన ఓపెనర్ యశస్వి జైస్వాల్(32) దురదృష్టకర రీతిలో రనౌటయ్యాడు. శ్రీలంక అరంగేట్ర స్పిన్నర్ కేశర నువంత తప్పిదంతో జైస్వాల్ బలయ్యాడు. కేఎల్ రాహుల్ ఆడిన బంతిని అడ్డుకోవడానికి కేశర డైవ్ చేయగా.. సింగిల్‌కు ప్రయత్నించిన జైస్వాల్ అతన్ని తాకి కిందపడిపోయాడు. అప్పటికే కేఎల్ రాహుల్ నాన్‌స్ట్రైక్ ఎండ్‌కు రాగా.. జైస్వాల్ కూడా యూటర్న్ తీసుకున్నాడు. దాంతో రనౌట్‌గా వెనుదిరిగాల్సి వచ్చింది. క్రీజులోకి వచ్చిన దేవదత్ పడిక్కల్‌తో కేఎల్ రాహుల్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. ఈ జోడీ ఆచితూచి ఆడటంతో టీమిండియా 27 ఓవర్లలో 101/1 స్కోర్‌తో లంచ్ బ్రేక్‌కు వెళ్లింది. ఇదే సమయంలో వర్షం రావడంతో గంటన్నర తర్వాత రెండో సెషన్ మొదలైంది. రాహుల్, పడిక్కల్ తమ జోరును కొనసాగించారు. తమకే సాధ్యమైన షాట్లతో శ్రీలంక బౌలర్లపై ఆధిపత్యం చెలాయించారు. రాహుల్ కాస్త నిదానంగా ఆడినా.. పడిక్కల్ వీలు చిక్కిన బంతిని బౌండరీకి తరలించాడు. ఈ క్రమంలో అతను 81 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. మరోవైపు కేఎల్ రాహుల్ 127 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించాడు. దాంతో టీమిండియా 197/1 స్కోర్‌తో టీ బ్రేక్ వెళ్లింది.ఆఖరి సెషన్‌లో కేఎల్ రాహుల్ బ్యాటింగ్ కొనసాగించలేకపోయాడు. చేతి, కాలి కండరాలు పట్టేయడంతో రిటైర్డ్ హర్ట్‌గా మైదానం వీడాడు. క్రీజులోకి కెప్టెన్ శుభ్‌మన్ గిల్ రాగా.. కేశర నువంత బౌలింగ్‌లో క్విక్ సింగిల్ తీసి పడిక్కల్ 134 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. పడిక్కల్‌కు ఇదే తొలి టెస్ట్ సెంచరీ కావడం గమనార్హం. తన మూడో టెస్ట్‌లోనూ ఈ ఫీట్ సాధించాడు. మరోవైపు శుభ్‌మన్ గిల్(16) నిరాశపర్చాడు. ప్రబాత్ జయసూర్య బౌలింగ్‌లో క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. క్రీజులోకి పంత్ రాగా.. వర్షం అంతరాయం కలిగించింది. కాసేపటి తర్వాత ఆట తిరిగి ప్రారంభం కాగా.. పంత్(27 బ్యాటింగ్), పడిక్కల్ దూకుడుగా ఆడారు. అజేయంగా 52 పరుగులు జోడించి తొలి రోజు ఆటను ముగించారు.కాగా.. దేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా భారత్ తన చారిత్రక 600వ టెస్ట్ మ్యాచ్ ఆడుతుండగా ఈ విచిత్రమైన రనౌట్ నమోదు కావడం విశేషం. రెండు మ్యాచ్‌ల ఈ టెస్టు సిరీస్‌లోని తొలి మ్యాచ్‌లో టాస్ గెలిచిన భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ మొదట బ్యాటింగ్ ఎంచుకున్నాడు. 2027 ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ రేసులో నిలవడానికి ఇరు జట్లకు ఈ సిరీస్ పాయింట్లు ఎంతో కీలకం. ప్రస్తుతం డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో భారత్ ఐదో స్థానంలో ఉండగా, శ్రీలంక ఆరో స్థానంలో కొనసాగుతోంది.



## నిరాశగా వెనుదిరిగిన జైస్వాల్

సీనియర్ బ్యాటర్ కేఎల్ రాహుల్‌తో సరైన సమన్వయం లోపించడంతో ఇద్దరు భారత బ్యాటర్లు ఒకే ఎండ్‌కు (క్రీజులోకి) చేరడం, చివరకు జైస్వాల్ తన వికెట్‌ను సమర్పించుకోవడం మ్యాచ్‌లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. భారత ఇన్నింగ్స్ కొనసాగుతున్న సమయంలో శ్రీలంక స్పిన్నర్ కేశర నువాంత వేసిన ఫ్లైటెడ్ డెలివరీని కేఎల్ రాహుల్ మిడ్-ఆన్ దిశగా చక్కగా డ్రైవ్ చేశాడు. బంతిని ఆపేందుకు బౌలర్ నువాంత డైవ్ చేసినప్పటికీ బంతి అతడి చేతికి చిక్కకుండా ముందుకు వెళ్లింది. అయితే అదే సమయంలో నాన్-స్ట్రైకర్ ఎండ్‌లో ఉన్న యశస్వి జైస్వాల్‌ను బౌలర్ ఢీకొట్టాడు. దీంతో అదుపు తప్పిన జైస్వాల్ పిచ్‌పై కిందపడిపోయాడు. మరోవైపు, షాట్ కొట్టిన వెంటనే సింగిల్ కోసం పరుగు తీసిన కేఎల్ రాహుల్ అప్పటికే పిచ్ మధ్యలోకి చేరుకున్నాడు. నాన్-స్ట్రైకర్‌గా ఉన్న జైస్వాల్ కింద పడిపోవడం చూసి రాహుల్ ఒక్కసారిగా తన పరుగును నిలిపివేశాడు. కానీ, వెంటనే తేరుకుని పైకి లేచిన జైస్వాల్.. పరుగు పూర్తి చేయాలనే ఉద్దేశంతో ముందుకు అడుగు వేశాడు. ఆ తర్వాత వెంటనే జైస్వాల్ తన మనసు మార్చుకుని వెనక్కి తిరిగి బౌలర్ వైపు ఉన్న క్రీజులోకి వెళ్లేందుకు ప్రయత్నించాడు. అయితే జైస్వాల్ ముందుకు రావడాన్ని పరుగు పూర్తి చేయమనే సంకేతంగా భావించిన కేఎల్ రాహుల్ వేగంగా నాన్-స్ట్రైకర్ ఎండ్‌కు చేరుకున్నాడు. చివరకు ఇద్దరు బ్యాటర్లు ఒకే వైపు ఉన్న క్రీజులోకి పరుగులు తీశారు. జైస్వాల్ కంటే ముందే రాహుల్ తన బ్యాట్‌ను క్రీజులో ఉంచడంతో జైస్వాల్ క్రీజు బయటే మిగిలిపోయాడు. శ్రీలంక ఫీల్డర్ ప్రభాత్ జయసూర్య విసిరిన బంతిని అందుకున్న వికెట్ కీపర్ నిరోషన్ డిక్వెల్లా ప్రారంభంలో బెయిల్స్‌ను పడగొట్టలేదు. స్లిప్‌లో ఫీల్డింగ్ చేస్తున్న కెప్టెన్ ధనంజయ డి సిల్వా వైపు చూస్తూ.. రనౌట్ చేయవచ్చా లేదా అని అడిగాడు. బ్యాటర్లు ఢీకొనడం వల్ల ఇది జరిగిందా క్రీడాస్ఫూర్తి పాటించాలా అనే సందిగ్ధత వారిలో కనిపించింది. అయితే బెయిల్స్ తొలగించడంలో ఎలాంటి ఇబ్బంది లేదని కెప్టెన్ ధనంజయ డి సిల్వా సంకేతం ఇవ్వడంతో డిక్వెల్లా వెంటనే స్టంప్స్‌ను పడగొట్టాడు. అనంతరం శ్రీలంక జట్టు రనౌట్ అప్పీల్‌ను ఉపసంహరించుకుందా లేదా అనే విషయాన్ని ఫీల్డ్ అంపైర్లు నిర్ధారించుకున్న తర్వాత జైస్వాల్‌ను రనౌట్‌గా ప్రకటించారు. దీంతో 37 బంతుల్లో 5 ఫోర్ల సాయంతో 32 పరుగులు చేసిన జైస్వాల్ నిరాశగా వెనుదిరిగాడు. టెస్ట్ క్రికెట్ చరిత్రలో యశస్వి జైస్వాల్ రనౌట్ కావడం ఇది మూడోసారి కావడం గమనార్హం.గతంలో 2024లో మెల్‌బోర్న్ వేదికగా ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌లో 82 పరుగుల వద్ద రనౌట్ అయ్యాడు. గతేడాది ఢిల్లీలో వెస్టిండీస్‌పై 175 పరుగుల భారీ ఇన్నింగ్స్ ఆడిన సందర్భంలోనూ రనౌట్‌గానే వెనుదిరిగాడు. ఇప్పుడు మరోసారి గాలేలో దురదృష్టవశాత్తూ రనౌట్ అయ్యాడు.

# విజయం దిశగా బంగ్లాదేశ్

- తొలి మ్యాచ్‌లో బంగ్లాదేశ్ సమష్టి ప్రదర్శన
- గ్రీన్, అలెక్స్ క్యారీపైనే ఆసీస్ ఆశలు



ఆస్ట్రేలియాతో తొలి టెస్ట్‌లో బంగ్లాదేశ్ విజయం దిశగా సాగుతోంది. రెండు టెస్ట్‌ల సిరీస్‌లో భాగంగా డార్విన్ వేదికగా జరుగుతున్న తొలి మ్యాచ్‌లో బంగ్లాదేశ్ సమష్టి ప్రదర్శనతో ఆకట్టుకుంటోంది. శనివారం మూడో రోజు ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్‌లో 4 వికెట్లకు 161 పరుగులు చేసింది. క్రీజులో కామెరూన్ గ్రీన్(43 బ్యాటింగ్)తో పాటు అలెక్స్ క్యారీ(19 నాటౌట్) ఉన్నాడు. ట్రావిస్ హెడ్(17), జేక్ వెదరాల్డ్(0) మరోసారి విఫలమవ్వగా.. మార్నస్ లబుషేన్(31), స్టీవ్ స్మిత్(44) కీలక భాగస్వామ్యాన్ని అందించారు. బంగ్లాదేశ్ బౌలర్లలో హసన్ మహ్మూద్(2/33) రెండు వికెట్లు తీయగా.. తైజుల్ ఇస్లామ్, మెహ్‌ది హసన్ మీరాజ్ తలో వికెట్ తీసారు. అంతకుముందు 351/6 ఓవర్‌నైట్ స్కోర్‌తో మూడో రోజు ఆటను ప్రారంభించిన బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 138 ఓవర్లలో 426 పరుగులకు ఆలౌటైంది. ఓవర్‌నైట్ బ్యాటర్ మెహ్‌దీ హసన్(154 బంతుల్లో 5 ఫోర్లు, సిక్స్‌తో 65) హాఫ్ సెంచరీతో రాణించాడు. తంజీద్ హసన్(197 బంతుల్లో 8 ఫోర్లు, సిక్స్‌తో 101) సెంచరీతో.. నజ్ముల్ హోస్సేన్ షాంటో(126 బంతుల్లో 7 ఫోర్లు, సిక్స్‌తో 84) హాఫ్ సెంచరీతో చెలరేగిన సంగతి తెలిసిందే. ఆసీస్ బౌలర్లలో జోష్ హేజిల్ వుడ్(6/89) ఆరు వికెట్లు తీయగా.. మిచెల్ స్టార్క్(2/79) రెండు వికెట్లు పడగొట్టాడు. ప్యాట్ కమిన్స్, నాథన్ లయన్ తలో వికెట్ తీసారు. దాంతో బంగ్లాదేశ్‌కు 228 పరుగుల భారీ ఆధిక్యం లభించింది. భారీ లోటుతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆసీస్.. అదే తడబాటు కొనసాగించింది. ఓపెనర్లు ట్రావిస్ హెడ్(17), జేక్ వెదరాల్డ్(0) తీవ్రంగా నిరాశపర్చారు. ఈ క్రమంలో లబుషేన్, స్మిత్ ఆచితూచి ఆడే ప్రయత్నం చేశారు. లబుషేన్‌ను తైజుల్ ఇస్లామ్ ఔట్ చేయగా.. స్మిత్‌ను మెహ్‌దీ హసన్ మిరాజ్ పెవిలియన్ చేర్చి హాఫ్ సెంచరీని అడ్డుకున్నాడు. కామెరూన్ గ్రీన్(43 బ్యాటింగ్), అలెక్స్ క్యారీ(19 బ్యాటింగ్) మరో వికెట్ పడకుండా మూడో రోజు ఆటను ముగించారు. ఈ ఇద్దరి ప్రదర్శనపైనే ఆసీస్ అవకాశాలు ఆధారపడి ఉన్నాయి. ఈ ఇద్దరూ సెంచరీలతో చెలరేగి భారీ లక్ష్యం నమోదు చేస్తే తప్పా ఈ మ్యాచ్‌లో ఆసీస్ గట్టెక్కలేదు. నాలుగో రోజు ఆటలో బంగ్లాదేశ్ బౌలర్లు చెలరేగిన ఆసీస్‌ను త్వరగా ఆలౌట్ చేస్తే బంగ్లాదేశ్ విజయం సులువు అవుతుంది. ప్రస్తుతం ఆసీస్ ఇంకా 67 పరుగుల వెనుకంజలో ఉంది. లక్ష్యం 200 ధాటకుండా చూసుకుంటే బంగ్లాదేశ్ చారిత్రాత్మక విజయం సాధ్యమవుతోంది. ఆసీస్‌పై బంగ్లాదేశ్ ఇప్పటి వరకు టెస్ట్ మ్యాచ్ గెలవలేదు. 23 ఏళ్ల తర్వాత ఆసీస్ గడ్డపై టెస్ట్ సిరీస్ ఆడుతోంది.

# హాకీ ప్రపంచకప్‌లో భారత జట్టు శుభారంభం

### తొలి మ్యాచ్‌లో వేల్స్‌పై భారత్ ఘన విజయం

### తొలి క్వార్టర్‌లోనే భారత్‌కు పెనాల్టీ కార్నర్



నెదర్లాండ్స్‌లో జరుగుతున్న హాకీ ప్రపంచకప్‌లో భారత పురుషుల జట్టు శుభారంభం చేసింది. పూల్-డిలో భాగంగా శనివారం జరిగిన తొలి మ్యాచ్‌లో వేల్స్‌పై భారత్ 3-1 తేడాతో విజయం సాధించింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ అద్భుత ప్రదర్శనతో జట్టుకు విజయాన్ని అందించాడు. హర్మన్‌ప్రీత్ రెండు గోల్స్ చేయగా సంజయ్ ఒక గోల్ సాధించాడు. మ్యాచ్ చివరి దశలో వేల్స్ ఒక గోల్ చేసినా అప్పటికే భారత్ తిరుగులేని ఆధిక్యంలో ఉండటంతో విజయానికి ఎలాంటి ఇబ్బంది ఎదురుకాలేదు. మ్యాచ్ ప్రారంభం నుంచే భారత ఆటగాళ్లు దూకుడుగా ఆడారు. తొలి క్వార్టర్‌లోనే భారత్‌కు పెనాల్టీ కార్నర్ లభించింది. ఏడో నిమిషంలో వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్న సంజయ్ అద్భుతమైన డ్రాగ్‌ఫ్లిక్‌తో గోల్ చేశాడు. వేల్స్ గోల్‌కీపర్‌కు ఎలాంటి అవకాశం ఇవ్వకుండా బంతిని నెట్‌లోకి పంపాడు. దీంతో భారత్ 1-0 ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ తర్వాత కూడా భారత జట్టు ఒత్తిడి కొనసాగించింది. మరో పెనాల్టీ కార్నర్‌ను భారత్ దక్కించుకోగా, ఈసారి కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ తన సత్తా చాటాడు. అద్భుతమైన షాట్‌తో బంతిని గోల్‌పోస్ట్ ఎడమ వైపునకు పంపాడు. దీంతో తొలి క్వార్టర్‌లోనే భారత్ 2-0 ఆధిక్యంలోకి వెళ్లింది. మొదటి 15 నిమిషాల్లోనే భారత ఆటగాళ్లు ప్రత్యర్థిపై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించారు. రెండో క్వార్టర్‌లో వేల్స్ కొంత మెరుగ్గా రక్షణాత్మకంగా ఆడింది. భారత్‌కు మరో పెనాల్టీ కార్నర్ లభించినప్పటికీ దానిని గోల్‌గా మలచలేకపోయింది. బంతిని అందుకునే సమయంలో చిన్న పొరపాటు జరగడంతో భారత అవకాశాన్ని కోల్పోయింది. మరో పెనాల్టీ కార్నర్‌లో హర్మన్‌ప్రీత్ చేసిన ప్రయత్నం కూడా లక్ష్యాన్ని చేరలేదు. ఈ క్వార్టర్‌లో ఇరు జట్లూ గోల్ చేయలేకపోయాయి. దీంతో తొలి అర్ధభాగం ముగిసే సమయానికి భారత్ 2-0 ఆధిక్యంలో నిలిచింది. మూడో క్వార్టర్‌లో భారత ఆటగాళ్లు మరింత నియంత్రణతో ఆడారు. ఓపెన్ ప్లేలో కూడా అవకాశాలను సృష్టిస్తూ ప్రత్యర్థి డిఫెన్స్‌పై ఒత్తిడి పెంచారు. ఈ క్రమంలో భారత్‌కు మరో పెనాల్టీ కార్నర్ లభించింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ మరోసారి తన డ్రాగ్‌ఫ్లిక్‌తో మెరిశాడు. బంతిని నేరుగా గోల్‌పోస్ట్‌లోకి పంపి భారత్ ఆధిక్యాన్ని 3-0కు పెంచాడు. హర్మన్‌ప్రీత్‌కు ఇది మ్యాచ్‌లో రెండో గోల్.మూడో క్వార్టర్‌లో ఇరు జట్ల నుంచి పెద్దగా గోల్ అవకాశాలు కనిపించలేదు. అయితే 3-0 ఆధిక్యంతో ఉన్న భారత్ మ్యాచ్‌పై పూర్తిగా పట్టు సాధించింది. చివరి క్వార్టర్‌లో వేల్స్ కనీసం ఒక గోల్ చేసి లోటును తగ్గించాలని ప్రయత్నించింది. భారత గోల్‌కీపర్ మోహిత్ కీలక సమయంలో అద్భుతమైన సేవ్ చేశాడు. వేల్స్‌కు లభించిన పెనాల్టీ కార్నర్‌ను సమర్థంగా అడ్డుకుని భారత ఆధిక్యాన్ని కాపాడాడు. అయితే మ్యాచ్ ముగిసే సమయంలో వేల్స్‌కు ఓ గోల్ దక్కింది. భారత గోల్‌పోస్ట్ ముందు తీవ్ర గందరగోళం నెలకొన్న సమయంలో సామ్ వెల్ష్ బంతిని గోల్‌లైన్ దాటించాడు. వీడియో అంపైర్ పరిశీలన తర్వాత గోల్‌ను చెల్లుబాటు అయ్యేదిగా ప్రకటించారు. దీంతో వేల్స్ 1-3తో లోటును తగ్గించింది. ఆ తర్వాత భారత్ ఎలాంటి అవకాశం ఇవ్వకుండా మ్యా చ్‌ను ముగించింది. ా మ్యాచ్‌లో భారత్‌కు మొత్తం ఐదు పెనాల్టీ కార్నర్లు లభించగా, వాటిలో మూడు గోల్స్‌గా మారడం జట్టు బలాన్ని చాటింది. మరోవైపు, డిఫెన్స్‌లోనూ భారత్ మెరుగైన ప్రదర్శన చేసింది. ప్రత్యర్థికి అవకాశాలు వచ్చినప్పుడు గోల్‌కీపర్ మోహిత్‌తో పాటు డిఫెండర్లు సమర్థంగా అడ్డుకున్నారు. ప్రపంచకప్‌లో భారత జట్టు ఈసారి పతకంపై గురిపెట్టింది. గతంలో ప్రపంచ కప్‌లో భారత్ మూడు పతకాలు సాధించగా 1975లో మాత్రమే స్వర్ణ పతకం గెలిచింది. ఈసారి పతక కరవును ముగించాలనే పట్టుదలతో జట్టు బరిలోకి దిగింది. టోర్నీకి ముందు ఎఫ్ఐహెచ్ ప్రో లీగ్‌లో జర్మనీ, నెదర్లాండ్స్ వంటి బలమైన జట్లపై భారత్ మంచి విజయాలు సాధించింది. పాకిస్థాన్‌ను రెండుసార్లు ఓడించడంతో పాటు ఇంగ్లాండ్‌పైనా విజయం సాధించింది. ప్రపంచకప్‌లో భారత్ పూల్-డిలో ఇంగ్లాండ్, పాకిస్థాన్, వేల్స్‌తో కలిసి ఉంది. తొలి మ్యాచ్‌లో వేల్స్‌ను ఓడించిన భారత్, తదుపరి మ్యాచ్ లో ఆగస్టు 17న ఇంగ్లాండ్‌తో తలపడనుంది. ఆ తర్వాత ఆగస్టు 19న చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో మ్యాచ్ ఆడనుంది. ఈసారి ప్రపంచకప్‌లో సంప్రదాయ క్వార్టర్‌ఫైనల్ విధానం ఉండదు. తొలి దశలో ప్రతి పూల్‌లోని టాప్-2 జట్లు తదుపరి దశకు చేరతాయి. అక్కడి నుంచి సెమీఫైనల్ బెర్తులు ఖరారవుతాయి. దీంతో ప్రతి మ్యాచ్‌లో సాధించే విజయం భారత్‌కు కీలకంగా మారింది.

## ఓటిటి బాటపట్టిన చెన్నై లవ్ స్టోరీ



కిరణ్ అబ్బవరం, శ్రీ గౌరీ ప్రియ ప్రధానపాత్రల్లో తెరకెక్కిన చిత్రం 'చెన్నై లవ్‌స్టోరీ' ఓటిటి బాట పట్టింది. రవి నంబూరి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చి యూత్‌కు కనెక్ట్ అయింది. ఇప్పుడీ ప్రేమకథ ఓటీటీలోకి వచ్చేందుకు సిద్ధమైంది. సోనీలివ్ వేదికగా ఆగస్టు 21 నుంచి స్ట్రీమింగ్ కానుంది. తెలుగుతోపాటు హిందీ, తమిళం, కన్నడ, మలయాళం భాషల్లో అందుబాటులోకి రానున్నట్లు సంస్థ అధికారికంగా తెలిపింది. కథేంటంటే..: నివి (శ్రీ గౌరీ ప్రియ) తను ప్రేమించిన అబ్బాయి అజయ్ (త్రిగుణ్)తో కలిసి పెళ్లికి సిద్ధమవుతుంది. కానీ, తీరా ముహూర్త సమయానికి పెళ్లి పీటలెక్కాల్సిన ఆ కుర్రాడు తాను మరో అమ్మాయిని ప్రేమించానని చెప్పి.. బ్రేకప్ చెప్పి వెళ్లిపోతాడు. ఆమెని ఆ బాధ నుంచి బయట పడేసేందుకు మిత్రులు చెన్నైకి తీసుకెళ్లినా ఏ మార్పూ రాదు. పైగా ప్రేమ విఫలమైన బాధలో దేవదాసులా మందుకు బానిసవుతుంది. అలాంటి సమయంలో ఆమె ఉంటున్న ఇంట్లోకి స్టీవెన్ శంకర్ (కిరణ్ అబ్బవరం) అడుగు పెడతాడు. అతనొక అనాథ. దర్శకుడవ్వాలన్న ఆశతో చెన్నైలోకి అడుగు పెట్టిన అతనికి.. నివి ఫ్రెండ్స్ గ్యాంగే ఆశ్రయమిస్తారు. మొదట్లో స్టీవెన్ చేసే పనులు నివికి చిరాకు తెప్పించినా.. క్రమంగా అతని మాటలు, చేతలు తనలో మార్పు తెస్తాయి. ఈ క్రమంలోనే బ్రేకప్ బాధ నుంచి బయటపడి.. స్టీవెన్‌కి దగ్గరవుతుంది. మళ్లీ ఆమెలో ప్రేమ చిగురిస్తుంది. మరి ఆ తర్వాత వాళ్లిద్దరి ప్రయాణం ఎలా సాగిందనేది కథ.

## డిసి సక్సెస్‌తో మైత్రీమూవీ మేకర్స్ విజయోత్సవ వేడుక



టాలెంటెడ్ డైరెక్టర్ లోకేష్ కనగరాజ్ ప్రధాన పాత్రలో నటించిన 'డిసి' చిత్రం బాక్సాఫీస్ వద్ద అద్భుతమైన విజయాన్ని సొంతం చేసుకుని దూసుకుపోతోంది. ఈ సినిమా సాధించిన సంచలన విజయంతో చిత్ర పరిశ్రమలో ప్రశంసల జల్లు కురుస్తోంది. అయితే ఈ సినిమా సాధించిన సక్సెస్ నేపథ్యంలో ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ మోస్ట్ అవేటెడ్ పాన్-ఇండియా ప్రాజెక్ట్ 'ఎఎ23' టీమ్ మరియు ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ అధినేతలు డైరెక్టర్ లోకేష్ కనగరాజ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. 'డిసి' మూవీ బ్లాక్‌బస్టర్ సక్సెస్‌ను పురస్కరించుకుని చిత్ర యూనిట్ ఘనంగా వేడుకలు నిర్వహించింది. ఈ సెలబ్రేషన్స్‌కు సంబంధించిన ప్రత్యేక ఫొటోలను మైత్రి మూవీ మేకర్స్ సోషల్ మీడియా వేదికగా అభిమానులతో పంచుకున్నారు. 'డిసి చిత్రానికి అఖండ విజయం అందించినందుకు అభినందనలు లోకేష్ కనగరాజ్. ఇప్పుడు ఎఎ23 వంతు! అంటూ మైత్రీ రాసుకోచ్చింది. ప్రస్తుతం డీసీ సక్సెస్ మూడ్‌లో ఉన్న లోకీ త్వరలోనే 'ఎఎ23' ప్రాజెక్ట్‌ను పట్టాలెక్కించబోతున్నాడు.

-----

## విజయ్ రణబాలి నుంచి పోస్టర్ విడుదల




స్వాతంత్ర్య దినోత్సవ కానుకగా రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ నటిస్తున్న భారీ పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'రణబాలి' సినిమా నుంచి మేకర్స్ ఒక పవర్‌ఫుల్ పోస్టర్‌ను విడుదల చేశారు. దర్శకుడు రాహుల్ సంకృత్యాన్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రం 1854-1878 కాలంలో రాయలసీమ నేపథ్యంలో బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా సాగే చారిత్రక పోరాటం ఆధారంగా రూపుదిద్దుకుంటోంది. 'మరపురాని చరిత్రలోని అత్యంత సాహసోపేతమైన అధ్యాయం అనే ట్యాగ్‌లైన్‌తో ఈ పోస్టర్ హైలైట్ అవుతోంది. ఈ పోస్టర్‌లో విజయ్ దేవరకొండ రక్తం, మట్టితో కూడిన యుద్ధ వీరుడి రూపంలో కనిపిస్తున్నారు. ఆయన పొడవుగా ఉన్న జుట్టు, మీసం, ఒంటిపై గాయాలు ఈ పాత్ర తీవ్రతను తెలియజేస్తున్నాయి. జాతీయ జెండా ఆయన భుజంపై ఒక యోధుడి కవచంలా కప్పబడి ఉంది. దీనికి ఉన్న రక్తపు మరకలు స్వాతంత్ర్య పోరాటంలోని త్యాగాన్ని ప్రతిబింబిస్తున్నాయి. ఇక ప్రస్తుతం ఇందుకు సంబంధించిన లుక్ వైరల్‌గా మారింది. ఈ చిత్రంలో విజయ్ సరసన రష్మిక మందన్న నటిస్తుండగా, హాలీవుడ్ నటుడు ఆర్నాల్డ్ వోస్లూ (ది మమ్మీ ఫేమ్) కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రం త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది.

## సైరాబాను ఫస్ట్ లుక్ విడుదల

హీరో ఆది సాయికుమార్ కథానాయకుడిగా నటిస్తున్న సరికొత్త తెలుగు చిత్రం 'సైరాబాను' ఫస్ట్ లుక్ పోస్టర్‌ను నేడు, స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా ఆఫీషియల్ గా రిలీజ్ చేశారు. ఈ సినిమాలో ఆది సాయికుమార్ సరసన 'మసూద' చిత్రంతో మంచి గుర్తింపు తెచ్చుకున్న బాంధవి శ్రీధర్ హీరోయిన్‌గా నటిస్తోంది. హాస్య మూవీస్ పతాకంపై ప్రముఖ నిర్మాత రాజేష్ దండా ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ను ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తుండగా, ఈ చిత్రం ద్వారా ఫణి కృష్ణ సిరికి దర్శకుడిగా తెలుగు చిత్రసీమకు పరిచయం అవుతున్నారు. ఈ సినిమా విభిన్న సంస్కృతుల నేపథ్యంలో సాగే ఒక పవర్‌ఫుల్ అండ్ వైబ్రెంట్ లవ్ స్టోరీగా తెరకెక్కుతోంది. ఔట్ అండ్ ఔట్ కామెడీ, ఎమోషనల్ ఫ్యామిలీ డ్రామా ఎలిమెంట్స్‌తో రూపొందుతున్న ఈ చిత్రానికి ప్రముఖ మ్యూజిక్ డైరెక్టర్ శేఖర్ చంద్ర స్వరాలను అందిస్తున్నారు. శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ మూవీకి సంబంధించిన మరిన్ని వివరాలను త్వరలోనే చిత్ర యూనిట్ ప్రకటించనుంది. అయితే పోస్టర్‌లోని నేపథ్యం కథను మరింత ఆసక్తికరంగా మారుస్తోంది. ఒకవైపు హిందూ దేవాలయం, మరోవైపు ఇస్లామిక్ శైలిలో నిర్మించిన కట్టడం రెండు విభిన్న ప్రపంచాలను ఒకే ఫ్రేమ్‌లో నిలబెట్టినట్లుగా అనిపిస్తోంది. మధ్యలో ఎగురుతున్న తెల్ల పావురాలు శాంతి, ప్రేమకు ప్రతీకగా నిలుస్తూ పోస్టర్ లుక్ మాత్రం ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ఈ సినిమాలో హీరో ఆది సాయికుమార్ పక్కా తెలుగు సాంప్రదాయాలు, పద్ధతులు ఉన్న కుటుంబానికి చెందిన యువకుడిగా నటిస్తున్నారు. అలాగే, హీరోయిన్ బాంధవి శ్రీధర్ ఆధునిక ఆలోచనలు ఉన్న ముస్లిం యువతి (సైరాబాను) పాత్రలో కనిపిస్తున్నారు. వేర్వేరు నేపథ్యాలు, ఆచారాలు ఉన్న ఈ ఇద్దరి మధ్య ప్రేమ ఎలా చిగురించింది, వారి ప్రేమను గెలిపించుకోవడానికి ఎలాంటి ఇబ్బందులు పడ్డారు అనేదే ఈ సినిమా కథాంశంగా తెరకెక్కుతున్నట్లు తెలుస్తోంది. దర్శకుడు ఫణి కృష్ణ సిరికి ఈ ప్రేమకథను ఎమోషనల్‌గానే కాకుండా, రెండు కుటుంబాల మధ్య జరిగే ఔట్ అండ్ ఔట్ ఫ్యామిలీ కామెడీ ఎంటర్‌టైనర్‌గా కూడా తెరకెక్కిస్తున్నారు.

---------




## సంక్రాంతి బరిలో సాయి తేజ్...

### 'సంబరాల ఏటి గట్టు' రిలీజ్ డేట్ ఇదే!

సుప్రీం హీరో సాయి దుర్గా తేజ్ కథానాయకుడిగా, రోహిత్ కేపీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న పాన్ ఇండియా చిత్రం 'సంబరాల ఏటి గట్టు' (ఎస్+) విడుదల తేదీని చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ సినిమాను వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా జనవరి 12న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు శనివారం వెల్లడించింది. ఈ ప్రకటనతో మెగా అభిమానుల్లో పండుగ వాతావరణం నెలకొంది.

ఈ సందర్భంగా సాయి దుర్గా తేజ్ తన ఎక్స్ ఖాతా ద్వారా స్పందిస్తూ, "సంక్రాంతికి కలుద్దాం... #SYGonJan12th #SambaraluForSankranthi»» అని పేర్కొంటూ కొత్త పోస్టర్‌ను పంచుకున్నారు. తేజ్ కెరీర్‌లోనే అత్యంత భారీ స్థాయిలో, సుమారు రూ. 125 కోట్ల భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తుండటం విశేషం. బ్లాక్‌బస్టర్ చిత్రం 'హనుమాన్' తర్వాత ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై కె. నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి ఈ సినిమాను నిర్మిస్తున్నారు.

'సంబరాల ఏటి గట్టు' చిత్రాన్ని పాన్ ఇండియా స్థాయిలో అత్యున్నత సాంకేతిక విలువలతో తీర్చిదిద్దుతున్నారు. ఈ చిత్రంలో సాయి దుర్గా తేజ్ సరసన ప్రముఖ నటి ఐశ్వర్య లక్ష్మి హీరోయిన్‌గా నటిస్తున్నారు. జగపతి బాబు, శ్రీకాంత్, సాయి కుమార్, అనన్య నాగళ్ల, రవి కృష్ణ వంటి భారీ తారాగణం కీలక పాత్రలు పోషిస్తున్నారు. గత ఏడాది సెప్టెంబర్‌లోనే జాతీయ అవార్డు గ్రహీత పీటర్ హెయిన్ నేతృత్వంలో ఒక భారీ యాక్షన్ సన్నివేశాన్ని చిత్రీకరించారు. ఈ సినిమాలో తేజ్ ఒక ప్రముఖ బాలీవుడ్ సూపర్‌స్టార్‌తో తలపడనున్నారని, ఆయన శక్తివంతమైన ప్రతినాయకుడి పాత్రలో కనిపిస్తారని సమాచారం. ఈ పాత్ర కోసం సాయి దుర్గా తేజ్ గత రెండేళ్లుగా శారీరకంగా, మానసికంగా తీవ్రంగా శ్రమిస్తున్నారు. సినిమాలోని కీలక సన్నివేశాల కోసం గ్రాఫిక్స్ పనులు కూడా వేగంగా జరుగుతున్నాయి. 'సంబరాల ఏటి గట్టు' చిత్రానికి వెట్రి పళనిస్వామి సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, అజనీష్ లోక్‌నాథ్ సంగీతం సమకూరుస్తున్నారు. తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో ఏకకాలంలో విడుదల కానున్న ఈ యాక్షన్ డ్రామా, భారతీయ చిత్ర పరిశ్రమలో ఒక మైలురాయిగా నిలుస్తుందని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది.




## కట్టలు తెంచుకున్న రోమాన్స్ ..హుషారు పిట్టలు !

యువతరమే లక్ష్యంగా తీర్చిదిద్దిన తాజా చిత్రం 'హుషారు పిట్టలు'. ఏషియన్ సురేశ్ ఫిల్మ్స్ లాంటి పెద్ద సంస్థ దీన్ని స్వయంగా విడుదల చేస్తుండటం.. ప్రేక్షకుల దృష్టి ఈ సినిమాపై పడింది. రవి (అన్ష్) టాపర్. టెన్త్‌లో స్కూల్ ఫస్ట్. చదువు తప్ప మరో ధ్యాస లేని ఆ కుర్రాడిని.. ఊళ్లోని బాలు గ్యాంగ్ అశ్లీల వీడియోలు చూపించి చెడగొడుతుంది. దీంతో పుస్తకాల్ని పక్కకు పెట్టేసి అమ్మాయిల్ని పడేసే పనిలో పడతాడు. ఈ క్రమంలోనే అదే ఊరిలో ఉండే చిట్టి (వాసవి గణెశిశన్)ని ఇష్టపడతాడు. అప్పటికే అతనిపై ఆకర్షణతో ఉన్న ఆమె కూడా అతడికి దగ్గరవుతుంది. పరిపక్వత లేని ఆ వయసులో వాళ్లిద్దరూ హద్దులు దాటేస్తారు. ఓరోజు అలా కలిసి ఉండగా తల్లిదండ్రులకు దొరికిపోతారు. మరి ఆ తర్వాత ఏమైంది? తమ పిల్లల్ని అలా చూడకూడని స్థితిలో చూసిన ఆ తల్లిదండ్రులు ఏమైపోయారు? ఆ బాధని గుండెల్లో దాచుకుని ఎలాంటి కఠిన నిర్ణయాలు తీసుకున్నారు? ఓవైపు అమ్మానాన్నల వ్యతిరేకతను.. సమాజం నుంచి ఎదురయ్యే ఛీత్కారాలను ఎదుర్కొంటూ ఆ జంట తమ ప్రేమ కోసం ఏం చేశారు? దాని వల్ల వాళ్ల జీవితాల్లో చోటు చేసుకున్న పరిణామాలేంటి? ఆఖరికి వాళ్లు ఒక్కటయ్యారా.. లేదా? చిన్న వయసులో తెలిసీ తెలియక చేసిన తప్పు వల్ల ఆఖరికి వాళ్ల జీవితాలు ఎలా మారాయి? అన్నది మిగిలిన కథ. ఇది యువతరం లక్ష్యంగా రూపొందిన సినిమా. టీజర్.. ట్రైలర్‌లతోనే ఈ చిత్ర కంటెంట్ ఏంటి? ఎంత బోల్డ్‌గా ఉంటుందనే దానిపై స్పష్టత




ఇచ్చేశారు. 'బస్ స్టాప్', 'ఈరోజుల్లో..' లాంటి చిత్రాల ఛాయల్లోనే సాగుతుంది. సినిమాలో సింహభాగం అడల్ట్ కంటెంట్‌తో నవ్వులు పంచి.. ఆఖరిలో ఎమోషనల్ టచ్‌తో చిన్న సందేశం ఇచ్చి ప్రేక్షకుల్ని థియేటర్ నుంచి బయటికి పంపుతుంది. ఇది పిల్లలతో పాటు తల్లిదండ్రులు చూడాల్సిన చిత్రమే అయినప్పటికీ.. ఆ అడల్ట్ కంటెంట్‌ని స్వీకరించే సాహసం చేస్తారా అన్నది సందేహమే. నాయకా నాయికల పాత్రల పరిచయం.. ఒకరిపై ఒకరికి ఆకర్షణ.. ఫోన్ ముచ్చట్లు.. హద్దులు దాటి దగ్గరయ్యేందుకు చేసే ప్రయత్నాలు.. కథలో సంఘర్షణని రగిలించేలా ఉంటాయి. అంత వరకు చాటుమాటుగా సాగిన రవి - చిట్టీల వ్యవహారం ఇంటిదాకా చేరడంతో ద్వితీయార్ధం ఆసక్తికరంగా మొదలవుతుంది. కాకపోతే ఆయా సన్నివేశాలన్నీ ఊహలకు అందేలా ఉంటాయి. ఇక ఎప్పుడైతే వీళ్లు రెడ్ హ్యాండెడ్‌గా ఇంట్లో వాళ్లకి దొరికిపోతారో అక్కడి నుంచి కథ సీరియస్ టోన్‌లోకి టర్న్ తీసుకుంటుంది. రవి - చిట్టి తప్పటడుగులు వేయడం వెనకున్న కారణాల్ని బలంగా చెప్పే ప్రయత్నం చేశారు. పిల్లలు ఎదురుగా తల్లిదండ్రులు చేసే పనులు వాళ్ల వ్యక్తిత్వాలపై ఎలాంటి ప్రభావం చూపిస్తాయి.. అతి గారాబం.. తప్పుడు స్నేహాలు, సెల్ ఫోన్ వాడకం వాళ్లని ఎలా తప్పుడు దారుల్లో నడిచేలా పురిగొల్పుతాయన్నది కళ్లకు కట్టినట్లు చూపించారు. పరిణతి లేని ప్రేమికుల్లా ఆ రెండు పాత్రల్లో అన్ష్, వాసవి సహజమైన నటనతో ఆద్యంతం అలరించారు. రొమాంటిక్ సీన్స్ తో పాటు భావోద్వేగ భరిత సన్నివేశాల్లోనూ మెప్పించారు. ముఖ్యంగా చిట్టి పాత్రలో వాసవి చెప్పే డైలాగ్స్.. శైలు పాత్రని ఇబ్బంది పెడుతూ తను చేసే హంగామా యువతకి బాగా వినోదాన్ని పంచిస్తుంది. కథానాయిక తండ్రి పాత్రలో గోవర్ధన్, హీరో తల్లిదండ్రులుగా సునీత, రమేష్ ఆకట్టుకుంటారు. ఇది తెలిసిన కథే అయినా.. యువతరాన్ని ఆకట్టుకునేలా మలచడంలో దర్శకుడు విజయం సాధించాడు.

## విభిన్న కథతో శ్రీవిష్ణు..

### 'కామ్రేడ్ కళ్యాణ్' విడుదల తేదీ ఫిక్స్




విలక్షణ కథలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటుడు శ్రీవిష్ణు హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'కామ్రేడ్ కళ్యాణ్'. మహిమా నంబియార్ కథానాయికగా నటిస్తున్న ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్ విడుదల తేదీని చిత్రబృందం శనివారం అధికారికంగా ప్రకటించింది. అక్టోబర్ 9న ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు తెలిపింది.

ఈ విషయాన్ని శ్రీవిష్ణు తన సోషల్ మీడియా ఖాతా ద్వారా పంచుకున్నారు. "కామ్రేడ్స్! అక్టోబర్ 9న థియేటర్లలో మన 'కామ్రేడ్ కళ్యాణ్'తో 'లాల్ సలాం' చెబుదాం" అంటూ విడుదల తేదీ పోస్టర్‌ను షేర్ చేశారు. జనక్‌రామ్ మారెళ్ల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ప్రముఖ రచయిత కోన వెంకట్ సమర్పిస్తున్నారు. స్కంద వాహన మోషన్ పిక్చర్స్ ఎల్‌ఎల్‌పి పతాకంపై వెంకట కృష్ణ కర్నాటి, సీత కర్నాటి నిర్మిస్తున్నారు. 1992 నాటి ఆంధ్రా-ఒడిశా సరిహద్దు ప్రాంతం నేపథ్యంలో 'కామ్రేడ్ కళ్యాణ్' సినిమా కథ సాగనుంది. శ్రీవిష్ణు, మహిమా నంబియార్‌తో పాటు సీనియర్ నటి రాధికా శరత్‌కుమార్, మలయాళ నటుడు షైన్ టామ్ చాకో, ఉపేంద్ర లిమాయే వంటి ప్రముఖులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

ఇప్పటికే 'కామ్రేడ్ కళ్యాణ్' సినిమా నుంచి జూన్‌లో విడుదలైన 'ఒరియా పిల్ల' పాట చార్ట్‌బస్టర్‌గా నిలిచిన విషయం తెలిసిందే. విజయ్ బుల్గానిన్ స్వరపరిచిన ఈ గీతాన్ని సిద్ శ్రీరామ్ ఆలపించగా, భాస్కరభట్ల సాహిత్యం అందించారు. ఈ చిత్రానికి సాయిశ్రీరామ్ సినిమాటోగ్రఫీ, చోటా కె ప్రసాద్ ఎడిటింగ్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.


Printed, Published & Owned by Rachakonda Printers & Publication's at P. Mahesh Goud Office address :-Dwaraka nagarRoad no:6 Plot : 101500079 RR dist, Hyderabad TELANGANA State printed at SRI BALAJI PRINTING PRESS, H. No:- 5-2-396 Venkateshwara colony Saheb nagar Rangareddy 500070 TELANGANA STATE. EDITOR : P. Mahesh Goud 9908 502 602 , PRGI NO:- TGTEL/26/A6429. EMAIL: youvavelugu@gmail.com https://epaper.yuvavelugu.com